# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
20-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 146

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# 'చేయి' దాటుతోంది!

## తెలంగాణ కాంగ్రెస్‌లో కట్టు దాటుతున్న క్రమశిక్షణ

ఎవరికి వారే యమునా తీరుగా నాయకులు

క్రమేపి పట్టు కోల్పోతున్న రేవంత్ ..ఇలా అయితే కష్టమే

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

దీంతో ప్రత్యర్థులు కాంగ్రెస్ పార్టీని బలహీనం చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తుమ్మితే ఊడిపోయే సర్కార్ అనేదాకా పరిస్థితి వచ్చింది.

**ప్రారంభంలో దూకుడు..:** ప్రారంభంలో దూకుడు కనబరిచారు సీఎం రేవంత్. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకపక్ష విజయంతో

తెలంగాణలో ముఖ్యమంత్రిగా రేవంత్ ఉన్నారు. అనూహ్య పరిస్థితుల్లో ఆయన సీఎం అయ్యారు. కష్టపడి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చారు. అందుకే సీనియర్లను కాదని.. దశాబ్దాలుగా పార్టీకి సేవలందించిన నేతలను కాదని హై కమాండ్ రేవంత్ కు అవకాశం ఇచ్చింది. కానీ గడిచిన రెండున్నర ఏళ్ల లో పార్టీపై పూర్తిస్థాయిలో పట్టు సాధించలేకపోయారు రేవంత్. కానీ ఇప్పుడు క్రమేపి పట్టు సడలుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

- మిగతా 3వ పేజీలో



# ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో ట్విస్ట్..

## ఇద్దరు మైనర్లు విద్యార్థులు అరెస్ట్

చోరీకి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు..

- మాస్క్ జారిపోవడంతో బయటపడిన అసలు కథ
- రూపారెడ్డిపై 27 సార్లు కత్తితో దాడి చేసిన నిందితుడు
- రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ స్వాధీనం..
- 70 సీసీటీవీ కెమెరాల పరిశీలనతో ఛేదింపు



2లో

## పెరిగిన సినిమా టికెట్ ధరలకు కొత్త లెక్క.. 20 శాతం సంక్షేమానికే!

భారీ చిత్రాల టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే అదనపు ఆదాయంపై ప్రభుత్వ కీలక నిర్ణయం

పెరిగిన ధరలతో వచ్చిన కలెక్షన్‌లో 20% సంక్షేమ కార్యక్రమాలకు కేటాయింపు

నిర్మాతలే ఈ మొత్తాన్ని ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేసి సంబంధిత ఖాతాల్లో జమ చేయాలని ఆదేశం

# కాంగ్రెస్‌లో పరకాల చిచ్చు!



కాంగ్రెస్ పార్టీలో మరో కొత్త చిచ్చు. వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. ఇటీవల పరకాలలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. వచ్చే ఎన్నికల్లో ప్రస్తుతి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు.

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా రేవూరి ప్రకాష్ రెడ్డిని ప్రకటించిన సీఎం రేవంత్

తీవ్రంగా తప్పు పట్టిన కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్

ఖరారు చేయడానికి ముఖ్యమంత్రి ఎవరు అంటూ హాట్ కామెంట్స్

తానే బరిలో ఉంటానని ప్రకటన



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

దీంతో కాంగ్రెస్ పార్టీలో ముసలం మొదలైంది. ఈ సీట్ పై అప్పటినుంచో ఆశలు పెట్టుకున్నారు మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్. సీఎం ప్రకటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నారు.. అనుచిత వ్యాఖ్యలు చేశారు.

**ఆయన ఎదుగుదల వెనుక..**

తన పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సుస్మిత పటేల్ చేసిన కామెంట్స్ సోషల్

మిగతా 2లో



# సినిమాల్లోకి కేటీఆర్ తనయుడు!

గట్టిగా ప్లాన్ చేస్తున్న తండ్రి

సరైన దర్శకుడు, కథ కోసం వెతుకులాట

సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

**క్రైమ్ మిర్రర్, సినీ డెస్క్:**

టాలీవుడ్ లోకి మరో రాజకీయ వారసుడు ప్రవేశించనున్నారా? తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు

# కేంద్ర మంత్రులుగా ఈటెల,గోడం!

## తెలంగాణ నుంచి ఇద్దరికీ చోటు

బీసీ కోటాలో రాజేందర్, ఎస్టి కోటాలో నగేష్


సామాజిక సమీకరణలను ప్రాధాన్యం ఇస్తూ ఎంపిక చేసిన బిజెపి

2లో

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :**

కేంద్ర మంత్రివర్గ విస్తరణ పై ఆసక్తికర చర్చ నడుస్తోంది. భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గం ప్రకటించడంతో అనుమానాలకు బలం చేకూరుతోంది. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఈసారి ప్రాతినిధ్యం పెరగనుంది.

అందులో భాగంగా తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపీలకు ఛాన్స్ ఇస్తారని ఢిల్లీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రధానంగా ఇద్దరి పేర్లు ప్రముఖంగా



తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చుట్టూ వివాదాలు నడుస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో అత్యంత కీలకంగా వ్యవహరించి.. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడుగా కనిపించారు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. కానీ ఇప్పుడు ఆయన చుట్టూ నడుస్తున్న వివాదాలకు తెలంగాణ సర్కార్కు గుదిబండగా మారుతున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# పొంగులేటితో కాంగ్రెస్ సర్కార్‌కు డ్యామేజ్!



22 ఏ వివాదంతో రాష్ట్రవ్యాప్తంగా సంక్షోభం

కుటుంబ వ్యవహారాల్లో సైతం ఇబ్బందులే

గుదిబండగా మారుతున్న మంత్రి శ్రీనివాస్ రెడ్డి

# ఎన్నికలకు సిద్ధంకండి..

## గెలుపే లక్ష్యంగా పని చేయండి: జగన్

రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్

రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత,



2లో

# నీట్, రామ మందిర విరాళాలపై దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు

లోక్‌సభ సీట్ల పెంపును వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేసిన కాంగ్రెస్

ప్రస్తుత 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్

800 పట్టణాలకు విస్తరించనున్న రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్'

కేంద్ర ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం, రామ మందిర విరాళాల్లో చోటుచేసుకున్నాయన్న







# పొంగులేటితో కాంగ్రెస్ సర్కార్‌కు డ్యామేజ్!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :**

తాజాగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది సామాన్యుల ఆస్తులను తాకుతూ.. పెను దుమారాన్ని రేపుతున్న 22 ఏ సంక్షోభం.. రెవెన్యూ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ఇరుకున పెడుతోంది.




**మొన్నటి ఎన్నికలకు ముందే..**

2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు. అయితే ఆయన కుటుంబ వ్యాపారాలు, వ్యక్తిగత వ్యవహారాలు నిరంతరం అధికార పక్షానికి తలనొప్పిగా మారుతున్నాయి. గతంలో ఆయన కుమారుడికి సంబంధించి లగ్జరీ వాచీల స్మగ్లింగ్, హవాలా ఆరోపణ కేసుల్లో ఈడి, డి ఆర్ ఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆయన నివాసాలు, కార్యాలయాల పై వరుస దాడులు నిర్వహించడం ప్రభుత్వ ఇమేజ్ పై తీవ్ర ప్రభావం చూపింది. దీనికి తోడు గతంలో కేవలం ప్రభుత్వ కాంట్రాక్టులకే పరిమితమైన కుటుంబ సంస్థ రాఘవ కన్స్ట్రక్షన్స్ ఇటీవల కాలంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోని వట్టినాగులపల్లి వంటి కీలక ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులోకి ప్రవేశించడం.. ఆ క్రమంలో భూ వివాదాలు.. పోలీస్ కేసులో నమోదు కావడం చర్చకు దారి తీసింది.

**కాంగ్రెస్ లో పెరుగుతున్న అసంతృప్తి..**

మరోవైపు కాంగ్రెస్ పార్టీలో సైతం అంతర్గత విభేదాలకు కారణం అవుతున్నారు పొంగులేటి. ప్రభుత్వంలో కీలక కాంట్రాక్టులు, ప్రాజెక్టులు ఒకే సంస్థకు దక్కుతున్నాయని అసంతృప్తి కాంగ్రెస్ అంతర్గత విభాగాల్లో క్రమంగా బలపడుతోంది. గతంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఈ విషయంలో బహిరంగ ఆరోపణలు కూడా చేశారు. కొండా సురేఖ కూడా అదే తరహా ఆరోపణలు చేయగలిగారు. రెవెన్యూ శాఖలో కొనసాగుతున్న అవినీతి, వివాదాస్పద భూములను ప్రొహిబిటెడ్ లిస్టులో పెట్టి సెటిల్మెంట్ చేసుకున్నారంటూ వస్తున్న ఆరోపణలతో అధికార పార్టీ మరింత ఆత్మరక్షణలో పడిపోయింది. కేడర్ కోసం ఏళ్ల తరబడి పోరాడిన స్థానిక నేతలను విస్మరించి.. వ్యాపార ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తున్నారని భావన కాంగ్రెస్ శ్రేణుల్లో బలపడుతోంది.

**ఢిల్లీ సహకారంతోనే..**

మరోవైపు రోజురోజుకు పొంగులేటి కాంగ్రెస్ పార్టీలో బలపడుతున్నారు. మరింత స్వేచ్ఛగా ముందుకు వెళుతుండడంతో ప్రజల్లో వ్యతిరేకతకు, అనేక వివాదాలకు కారణం అవుతోంది. ఢిల్లీ కాంగ్రెస్ హై కమాండ్ తో ఉన్న బలమైన ఆర్థిక, రాజకీయ బంధాలతోనే రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ పొంగులేటిని కట్టడి చేయలేకపోతోంది అన్న విమర్శ ఉంది. జాతీయస్థాయిలో పార్టీకి ఆర్థికంగా అండగా నిలవడం, వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడల్లా వనరులు సమకూర్పులో కీలకంగా వ్యవహరించడం వల్లే ఆయన పలుకుబడి కొనసాగుతుందనే టాక్ వినిపిస్తోంది. అయితే పారదర్శక పాలన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మంత్రి పొంగులేటి చుట్టూ ముసురుకుంటున్న వివాదాలు పెద్ద మైనస్ అవుతున్నాయి. తాజాగా సామాన్యుల ఆస్తి హక్కులను దెబ్బతీసే 22ఏ వివాదం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పార్టీ గ్రాఫ్ ను అమాంతం దెబ్బతీస్తోంది.

# కేంద్ర మంత్రులుగా ఈటెల, గోడం!



వినిపిస్తున్నాయి. ఈటెల రాజేందర్ తో పాటు గోడం నగేష్ పేర్లు ఖరారు చేసినట్లు పొలిటికల్ సర్కిల్స్ లో ఒక టాక్ బలంగా పెరుగుతోంది. ఇప్పటికే తెలంగాణ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కిషన్ రెడ్డి, బీసీ వర్గాల నుంచి బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ఉన్నారు. రాష్ట్రంలో బీసీ జనాభా దృష్ట్యా ఈటెల రాజేందర్ ను తీసుకుంటారని తెలుస్తోంది. మరోవైపు ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పేరు ఖరారు చేసినట్లు సమాచారం.

**రకరకాల సమీకరణలు..**

వాస్తవానికి డీకే అరుణ పేరు ప్రముఖంగా వినిపించింది. కానీ ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రివర్గంలో ఉన్నారు. దీంతో అరుణ పేరు పక్కకు వెళ్లిపోయింది. మరోవైపు మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి బండి సంజయ్ కేంద్రమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు అదే సామాజిక వర్గం నుంచి ధర్మపురి అరవింద్ పేరును పరిశీలించిన హై కమాండ్ పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గం నుంచి ఈటెల రాజేందర్.. ఎస్టి సామాజిక వర్గం నుంచి గోడం నగేష్ పేరు మిగిలినట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరూ కేంద్ర మంత్రులుగా ఎంపిక కావడం ఖాయమని తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తోంది.

**సుదీర్ఘ నేపథ్యం..**

ఈటెల రాజేందర్ తెలంగాణ రాష్ట్ర సమితిలో క్రియాశీలకంగా పని చేశారు. కెసిఆర్ తరువాత నెంబర్ 2 గా కొనసాగారు. పలుమార్లు టిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. కీలక మంత్రిత్వ శాఖలను నిర్వర్తించారు. అయితే కెసిఆర్ కుటుంబ సభ్యుల రాకతో ఈటెల రాజేందర్ కు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఆయన గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పారు. బిజెపిలో చేరారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మల్కాజ్గిరి నుంచి పోటీ చేసి గెలిచారు. బలమైన బీసీ నేతగా గుర్తింపు ఉంది. ఆయనకు మంత్రి పదవి ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి హైకమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బండి సంజయ్ ఉండడంతో ఆయనకు ఈటెల రాజేందర్ తోడైతే తెలంగాణలో పార్టీ బలోపేతం కావడం ఖాయం అన్న ఆలోచనలో హై కమాండ్ ఉంది.

**ఏకైక ఆదివాసి ఎంపి..**

బిజెపి నుంచి దక్షిణ భారతదేశంలో గెలిచిన ఏకైక ఆదివాసి గోడం నగేష్. ఆదిలాబాద్ ఎంపీగా గెలిచారు. పార్టీలో వివాదరహితుడిగా పేరు ఉంది. ఆయనకు అవకాశం ఇవ్వడం ద్వారా దక్షిణ భారతదేశంలో ఆదివాసి ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో బిజెపి బలాన్ని మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఈ నేతకు కేంద్ర క్యాబినెట్ లో చోటు కల్పిస్తే రాజకీయంగా భారీ మైలేజ్ లభిస్తుందని జాతీయ నాయకత్వం భావిస్తోంది. చూడాలి బిజెపి హై కమాండ్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో..

# కాంగ్రెస్‌లో పరకాల చిచ్చు!

మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. రేవంత్ రెడ్డి రాజకీయ ఎదుగుదల లో కొండా కుటుంబం పాత్ర ఉందన్నారు. నాడు రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడానికి తమ తల్లిదండ్రులైన కొండా సురేఖ, కొండ మురళి పూర్తి మద్దతు ప్రధాన కారణం అని పేర్కొన్నారు. పిసిసి చీఫ్ అయిన కొత్తలో స్వయంగా తమ ఇంటికి వచ్చి కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని మాట ఇచ్చారని.. ఇప్పుడు ఆ హామీని ఎందుకు విస్మరిస్తున్నారు దేవుడిపై ప్రమాణం చేసి చెప్పాలని నిలదీశారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన సీనియర్ నేతలను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. అంతటితో ఆగని ఆమె రేవూరి ప్రకాష్ రెడ్డిని పరకాల అభ్యర్థిగా ప్రకటించడానికి రేవంత్ రెడ్డి ఎవరు అంటూ తీవ్ర పదజాలంతో ప్రశ్నించారు. పరకాల నియోజకవర్గం గురించి రేవూరికి అసలు ఏం తెలుసు అని నిలదీశారు.

**పాలనపై విమర్శలు..**

కొండా సురేఖ కుమార్తె మరోవైపు కాంగ్రెస్ పాలనపై కూడా విమర్శలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరు సంతోషంగా లేరని.. బీసీ వర్గాల నేతలకు సీఎం కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల నాటికి రేవంత్ రెడ్డి సీఎం గా కొనసాగుతారు కూడా తెలియదంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ మధ్య రేసు నడుస్తోంది అంటూ కామెంట్స్ చేశారు. పరకాల రాజకీయాల్లో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని.. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే బరిలో ఉంటానని.. తనను ఆపే శక్తి ఎవరికీ లేదని తేల్చి చెప్పారు. అయితే ఇటీవల కొండా సురేఖ స్వరంలో కూడా మార్పు వస్తోంది. ఇప్పుడు ఆమె కుమార్తె సైతం సీఎం రేవంత్ లెక్కలేని విధంగా మాట్లాడడం కాంగ్రెస్ పార్టీలో హాట్ టాపిక్ అవుతోంది.

# పెరిగిన సినిమా టికెట్ ధరలకు కొత్త లెక్క.. 20 శాతం సంక్షేమానికే!

**హైదరాబాద్:** భారీ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని సినీ కార్మికుల సంక్షేమానికి కేటాయించేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని సంక్షేమం కోసం కేటాయించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) ఖాతాల్లో జమ చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పెద్ది, రాజాసాబ్, మన శంకర వరప్రసాద్ గారు, అఖండ-2 చిత్రాలకు పెరిగిన టికెట్ ధరల ద్వారా వచ్చే కలెక్షన్‌పై ఈ నిబంధన అమలు చేయనున్నారు. పెంచిన టికెట్ ధరల ద్వారా వచ్చిన మొత్తంలో నిర్ణయించిన 20 శాతాన్ని ఎగ్జిబిటర్ల నుంచి నిర్మాతలు వసూలు చేసి సంబంధిత సంక్షేమ ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం సూచించింది. తద్వారా టికెట్ ధరల పెంపు వల్ల వచ్చే అదనపు ఆదాయంలో కొంత భాగం సినీ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి ఉపయోగపడేలా చర్యలు చేపట్టింది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు త్వరలో విడుదల కానున్న భారీ బడ్జెట్ సినిమాలకు కూడా ఈ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతులు ఇచ్చే క్రమంలో సంక్షేమ నిధుల అంశాన్ని కూడా ప్రభుత్వం కీలకంగా పరిగణిస్తున్నట్లు ఈ ఉత్తర్వులతో స్పష్టమవుతోంది.

# సినిమాల్లోకి కేటీఆర్ తనయుడు!

కూడా అలానే ఉన్నాయి. సాధారణంగా పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న కుటుంబాల నటులు రావడం చాలా అరుదు. ఇటువంటి సమయంలో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మనవడు, కేటీఆర్ కుమారుడు హిమాన్షురావ్ సినిమా రంగంలో తన టాలెంట్ నిరూపించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇమామ్స్ ఒక పవర్ఫుల్ ప్రాజెక్టుతో హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నారనే టాక్ టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. కేటీఆర్ తన కుమారుడిని గ్రాండ్ గా లాంచ్ చేసేందుకు సరైన కథ, దర్శకుడి కోసం వెతుకుతున్నట్టు టాక్ నడుస్తోంది.

**రాజకీయాల్లోకి నో ఛాన్స్..**

హిమాన్షు ఇప్పటివరకు రాజకీయ వేదికలు పంచుకున్న సందర్భాలు లేవు. కానీ కళాకారుడిగా తనను తాను ఇప్పటికే నిరూపించుకున్నాడు. సోషల్ మీడియాలో మ్యూజిక్ టాలెంట్ తో తనను తాను ప్రూవ్ చేసుకున్నాడు. ఆయన విడుదల చేసిన కవర్ సాంగ్స్ మ్యూజిక్ వీడియోలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నతనంలో బొద్దుగా ఉంటూ కనిపించిన హిమాన్షు క్రమంగా తన ఫిజిక్ ను పూర్తిగా మార్చేశారు. హీరోకు కావాల్సిన మేనరిజం, ఇతర యాక్టింగ్ స్కిల్స్ పై ట్రైనింగ్ కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**సోషల్ మీడియాలో యాక్టివ్..**

వాస్తవానికి హిమాన్షు సినీ ఎంట్రీ కి సంబంధించి ఆయనే హిట్ ఇచ్చారు. తన ఫిజికల్ ట్రాన్స్ ఫర్ మెన్ వీడియోలను, ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం ప్రారంభించిన తర్వాత రూమర్లు మొదలయ్యాయి. ఇప్పటికే కొంతమంది దర్శకులు కేటీఆర్ కు కథలు వినిపించినట్లు కూడా తెలుస్తోంది. మంచి స్క్రిప్ట్ తో పాటు దర్శకుడు దొరికితే అధికారిక ప్రకటన విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పొలిటికల్ వర్గాలతో పాటు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. గత నాలుగు రోజులుగా సోషల్ మీడియా హోరెత్తుతోంది. కానీ ఇంతవరకు అధికారిక ప్రకటన రాలేదు. అయితే తనపై జరుగుతున్న ప్రచారంపై హిమాంశ స్వయంగా స్పందించారు. ప్రస్తుతం తన సినిమా ఎంట్రీ కి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పారు. సినిమా ఇండస్ట్రీలోకి తాను అడుగు పెడుతున్నానని వార్తలు పూర్తిగా నిరాధారం అని పేర్కొన్నారు. ఒకవేళ భవిష్యత్తులో అలాంటి నిర్ణయం తీసుకుంటే.. తానే స్వయంగా చెబుతానని చెప్పడం ద్వారా పూర్తి సంకేతాలు ఇచ్చారు. సోషల్ మీడియాలో వచ్చిన రూమర్లను కొట్టిపారేసిన హిమాంశు.. భవిష్యత్తులో మాత్రం సినిమాల్లోకి వచ్చే అవకాశాన్ని పూర్తిగా కొట్టి పారేయలేదు.

# ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో ట్విస్ట్..




నల్గొండ: కొండమల్లేపల్లిలో ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో ఊహించని విషయాలు వెలుగులోకి వచ్చాయి. చోరీకి వెళ్లిన ఇద్దరు మైనర్ విద్యార్థులు ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు కావడంతో పాటు అకస్మాత్తుగా భారీగా డబ్బు ఖర్చు చేస్తున్న విషయాన్ని గుర్తించిన పోలీసులు.. ఆ కోణంలో దర్యాప్తు చేయడంతో కేసు కొలిక్కి వచ్చింది. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి ఇంట్లో దొంగతనం చేసేందుకు ఇద్దరు విద్యార్థులు పథకం వేసినట్లు తెలిపారు. వారిలో ఒకరు మాస్క్ ధరించి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడని, అయితే అనుకోకుండా మాస్క్ జారిపోవడంతో రూపారెడ్డి అతడిని గుర్తించారని చెప్పారు. తనను గుర్తుపట్టడంతో భయపడిన నిందితుడు వెంట తెచ్చుకున్న కత్తితో రూపారెడ్డిపై దాడి చేశాడని ఎస్పీ తెలిపారు. ఏకంగా 27 సార్లు కత్తితో పొడిచి ఆమెను హత్య చేసిన అనంతరం సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు వివరించారు. ఈ ఘటనకు ప్రధాన కారణం డబ్బు అని దర్యాప్తులో తేలిందన్నారు. గతంలో హాస్టల్‌లో ఉన్న సమయంలో నిందితుడి వద్ద నగదు, సెల్‌ఫోన్ లభించడంతో రూపారెడ్డి అతడిని మందలించినట్లు ఎస్పీ వెల్లడించారు. అప్పటి నుంచి ఆమెపై కక్ష పెంచుకున్న నిందితుడు.. చోరీతో పాటు ప్రతీకారంతో ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. కేసు దర్యాప్తు కోసం ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు సుమారు 70 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. నిందితుల నుంచి రూ. 1.54 లక్షల నగదు, ఒక ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదుపై ఉన్న రక్తపు మరకలను ల్యాబ్‌లో పరీక్షించగా అవి మానవ రక్తమని నిర్ధారణ అయినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులు ఇద్దరూ మైనర్లు కావడంతో వారిని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరచనున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

# నీట్, రామ మందిర విరాళాలపై దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు

అవకతవకల ఆరోపణలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ కార్యవర్గ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానించింది. పార్లమెంటులో నీట్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం విపక్షాల ఐక్యతకు నిదర్శనమని, దీనిని తమ విజయంగా భావిస్తున్నట్లు పార్టీ పేర్కొంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను కాంగ్రెస్ మరోసారి తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలనే యథాతథంగా కొనసాగించాలని, మహిళా రిజర్వేషన్లను కూడా ఈ స్థానాల్లోనే అమలు చేయాలని స్పష్టం చేసింది. నియోజకవర్గాల సంఖ్యను పెంచే ప్రతిపాదనకు తాము అంగీకరించబోమని ఈ సందర్భంగా తేల్చిచెప్పింది. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థులు, యువత లక్ష్యంగా రాహుల్ గాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాలకు విస్తరించాలని నిర్ణయించారు. వీటిలో పలు కీలక సమావేశాల్లో రాహుల్ గాంధీ స్వయంగా పాల్గొననున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా చొరబాట్ల అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని సీడబ్ల్యూసీ డిమాండ్ చేసింది. అలాగే కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం పలు రంగాల్లో విఫలమైందని విమర్శించింది. సీడబ్ల్యూసీ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను పార్టీ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ మీడియాకు వివరించారు.

# 'చేయి' దాటుతోంది!

(మొదటి పేజీ తరువాయి)

ఇక తిరుగు లేదని భావించారు. కానీ పార్టీకి, ప్రభుత్వానికి ఏకఛత్రాధిపతిగా వ్యవహరించాల్సిన రేవంత్ క్రమేపి పట్టు కోల్పోతున్నట్లు కనిపిస్తున్నారు. సొంత పార్టీ సీనియర్లు, ఎమ్మెల్యేల బహిరంగ అసమ్మతి ముందు నిస్సహాయంగా మారిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. క్రమశిక్షణ రాహిత్యంతో ఎవరికి వారు స్వతంత్ర ప్రకటనలు గుప్పిస్తున్నారు. వారిపై కనీస క్రమశిక్షణ చర్యలు తీసుకోలేని బలహీన స్థితికి పార్టీ నాయకత్వం చేరుకుంది.



**చిన్నారెడ్డి హెచ్చరిక..**

కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పని చేశారు జీవన్ రెడ్డి. ఆయనను పార్టీలో కొనసాగించే క్రమంలో నాయకత్వం సరిగా వ్యవహరించలేదన్న విమర్శ ఉంది. ఇప్పుడు ఆయన బాటలోనే మరో సీనియర్ నేత చిన్నారెడ్డి ప్రయాణించే అవకాశం ఉంది. పార్టీలో తనకు జరుగుతున్న అన్యాయం పై మండిపడుతూ తాను కూడా జీవన్ రెడ్డిలా తిరగబడతానంటూ హై కమాండ్ కె హెచ్చరికలు జారీ చేసే పరిస్థితికి వచ్చింది. మరోవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని వ్యక్తులకు, ఇతర ప్రాంతాల కాంట్రాక్టర్లకు పెద్దపీట వేస్తున్నారంటూ.. అవినీతిపై తిరుగుబాటు చేస్తానని బహిరంగంగానే సర్కారుపై విరుచుకుపడుతున్నారు. ఇక జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సైతం రెవిన్యూ శాఖలోని అక్రమాలు, సెటిల్మెంట్లపై ఆరోపణలు గుప్పిస్తున్నారు.

**సమన్వయ లోపం..**

ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీలో పాతతరం నాయకత్వానికి,, కొత్త తరం నాయకత్వం మధ్య సమన్వయం లేకుండా పోతోంది. పార్టీ మూల సిద్ధాంతాలను నమ్ముకుని దశాబ్దాలుగా సేవలందిస్తున్న కాంగ్రెస్ సీనియర్లను విస్మరించి.. వలస నేతలకు,, ఫిరాయింపుదారులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల క్షేత్రస్థాయిలో అసంతృప్తి పెరుగుతోందని అభిప్రాయం వినిపిస్తోంది. చాలా నియోజకవర్గాల్లో పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కుదరడం లేదు. కనీసం స్వయోద్య కుదిరిచే పని చేయడం లేదు.. ఫిరాయింపు నేతల రాజకీయ భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధత ప్రభుత్వ స్థిరత్వాన్ని కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో గట్టిగా వ్యవహరించాల్సిన రేవంత్ చూసి చూడనట్టుగా వదిలేస్తుండడం మాత్రం విమర్శలకు తావిస్తోంది. అది కాంగ్రెస్ పార్టీ అన్న విషయాన్ని రేవంత్ గుర్తించాలి. చెయ్యి దాటిపోతే ఆయన చేసేది ఏమీ ఉండదు కూడా..

## గిరిజిన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:వికారాబాద్ జిల్లా కుల్కచెర్ల మండల మండవెల్లికి చెర్ల గ్రామములోని గిరిజన అశ్రమ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, వసతులు, భోజనం, కిచెన్ ,తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి చదువు, విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆయన సూచించారు.పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని



కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్, విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాలకు సంబంధించిన అవసరాలు, సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అనంతరం బండ వెలికిచర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ది దారులతో మాట్లాడి బిల్లులు అన్నివచ్చాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న గృహ నిర్మాణ సదుపాయం సక్రమంగా చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఏంపిడిఓ రామకృష్ణ, తహసిల్దార్ పురుషోత్తం , ఏఎం సి చైర్మన్ ఆంజనేయులు, ఏం ఇ ఓ అబీబ్ అహమ్మద్, పిఆర్ఎఇ లు సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే కాంగ్రెస్‌కు వెన్నెముక.. పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయాలి
- ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండాలి
- బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి
- ప్రతి కార్యకర్తకు గౌరవం.. ప్రతి నాయకుడికి బాధ్యత
- నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కీలకం
- ప్రతి గ్రామం, వార్డులో పార్టీని బలోపేతం చేయాలి
- సంఘటన్ సృజన్ అభియాన్‌తో అభిప్రాయ సేకరణ
- పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: నీలం మధు



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19: కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గంలోని అశోక్‌నగర్‌లో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.సంగారెడ్డి జిల్లాకు సంఘటన్ సృజన్ అభియాన్ పీసీసీ అబ్జర్వర్ శ్రీనివాస్‌బాబు పర్యవేక్షణలో, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపక్ రాథోర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పదాధికారులతో సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తకు గౌరవం, ప్రతి నాయకుడికి బాధ్యత, అన్ని స్థాయిల్లో సమన్వయం ఉంటేనే పార్టీ మరింత బలపడుతుందని అన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటు ప్రజల సమస్యలను నిరంతరం తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ నాయకులు, బ్లాక్, మండల అధ్యక్షులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరుల అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడం పార్టీ భవిష్యత్ సంస్థాగత నిర్మాణానికి ఉపయోగపడుతుందని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో నాయకత్వం, కార్యకర్తల మధ్య సమన్వయం, ప్రజలతో నిరంతర అనుసంధానం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని నీలం మధు సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో కాంగ్రెస్‌ను బలమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు అందరు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, మాజీ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుల్కచర్ల పీహెచ్‌సీలో సిబ్బంది నిర్లక్ష్యంపై కలెక్టర్కు ఫిర్యాదు

### రోగులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బంది ఆగ్రహం

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల తగిన శ్రద్ధ చూపకపోవడం వంటి ఆరోపణలు మరోసారి వెలుగులోకి



వచ్చాయి. వికారాబాద్ జిల్లా కలెక్టర్ బుధవారం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేయడంతో ఆసుపత్రిలోని పరిస్థితులపై చర్చ మొదలైంది.ఈ సందర్భంగా ఓ వ్యక్తి కలెక్టర్‌కు పీహెచ్‌సీలో తాను ఎప్పుడు వచ్చినా సిబ్బంది అందుబాటులో ఉండరని, ఉన్న కొద్దిమంది సిబ్బంది సైతం రోగుల పట్ల ఆసక్తి, బాధ్యతతో వ్యవహరించడం లేదని కలెక్టర్కు విన్నవించాడు. రోగి సమస్య ఏమిటో పూర్తిగా తెలుసుకునే ప్రయత్నం చేయకుండానే ఏదో ఒక మందు ఇచ్చి పంపించడం, అవసరం ఉన్నా లేకపోయినా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరుగుతోందని ఆయన ఫిర్యాదు చేషాడు.పీహెచ్‌సీకి వచ్చే రోగులతో సున్నితంగా, గౌరవంగా మాట్లాడి వారి సమస్యను పూర్తిగా తెలుసుకుని వైద్యం అందించాల్సి ఉండగా, 'వచ్చారు--చూశారు--పంపించారు' అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రోగికి ఏం సమస్య ఉందో వివరంగా తెలుసుకోకుండా తూతూమంత్రంగా వైద్యం చేసి పంపించడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం దెబ్బతింటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కలెక్టర్ పిహెచ్ సిని ఆకస్మిక తనిఖీ**

వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారిని కుల్కచర్ల మండలానికి పర్యటనలో భాగంగా కుల్కచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మి ఖాతానికి చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్యం, రిఫరల్ విధానం, సిబ్బంది వ్యవహారశైలిపై సమగ్రంగా పరిశీలన జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ వైద్య కేంద్రానికి వచ్చే ప్రతి పేషెంట్‌ను బాధ్యతగా చూసి, అవసరమైన వైద్యం అందించి, తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇతర ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిబ్బందిపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేంలో పాల్గొన్న కుల్కచర్ల పిఎసిఎస్ వైస్ చేర్మెన్ ఎల్పటి అశోక్ కుమార్

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మరికల్ గ్రామములో బుధవారం ఇందిరమ్మ గృహప్రవేశం కార్యక్రమంలో ఉమ్మడి కుల్కచర్ల మండలం పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్,చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ ఎంపిటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు,ఖిఎం డైరెక్టర్ ఈ కార్యక్రమంలో పి ఎస్ సి ఎస్ డైరెక్టర్ దామోదర్ రెడ్డి,ఉప సర్పంచ్ పాండు,గ్రామ కమిటీ అధ్యక్షులు శివకుమార్, సత్యకుమార్,నరేందర్,మాజీ డైరెక్టర్ నర్సింలు,వార్డ్ నెంబర్ మహేష్,శివ,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలను వేసి అధిక లాభాన్ని పొందాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: రైతులు ఆరుతడి పంటలను వేసి అధిక లాభాలు పొందాలని,ప్రధాన పంటలతో పాటు అనుకూలమైన అంతర పంటలను సాగు చేయడం ద్వారా భూమి ఉత్పాదకతను వినియోగించుకోవడంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ దీపక్ తివారి సూచించారు.బుధవారము కుల్కచర్ల మండలంలోని బండ వెలికిచర్ల గ్రామంలో రైతులు పండించే ఆయిల్‌పామ్, గులాబీ, కూరగాయల తోటలను పరిశీలించారు. బండివెల్లికచెర్ల గ్రామంలోని రైతు సంజీవరెడ్డి 6.5 ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను వికారాబాద్ జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి ఎం.ఏ. సత్తార్, మండల మండల స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని నేలలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన ఆయిల్‌పామ్ మొక్కలు, బిందు సేద్యం తదితరాలకు రాయితీ సహాయం అందిస్తున్నందున, అర్హత కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఆయిల్‌పామ్ తోటల్లో రైతులు అంతర పంటలుగా కూరగాయలు, పెసర్లు, బొబ్బర్లు, వేరుశెనగ తదితర పంటలను సాగు చేసుకోవచ్చని అధికారులు వివరించారు. ఆయిల్‌పామ్ ప్రధాన పంటతో పాటు అంతర పంటల సాగును ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ ద్వారా ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.అనంతరం అదే గ్రామంలో రైతు సాగు చేస్తున్న గులాబీ తోటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రాంనగర్ గ్రామంలో రైతులు సుమారు 4.5 ఎకరాల్లో బీర, కాకర, చిక్కుడు, టమాట పంటలను మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న క్షేత్రాలను సందర్శించారు. కూరగాయల సాగు మల్చింగ్ విధానాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీ ద్వారా రైతులకు సహాయం అందిస్తోందని తెలిపారు. మల్చింగ్‌కు ఎకరానికి రూ.8,000 వరకు రాయితీ అందిస్తున్నట్లు పేర్కొంటూ, ఆసక్తి గల రైతులు కూరగాయల సాగును చేపట్టి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి ఎం.ఏ. సత్తార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కవిత, మండల వ్యవసాయ, ఉద్యాన శాఖ ఏఈఓలు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

**గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక ల్ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పూ÷-రోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు.**


చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టిఎసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే

# ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండండం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి మోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

# సిరా మచ్చల వెనుక.. మారని పేదరికం!

**తెల్లవారుజామున నాలుగు గంటలు .పక్షుల కిలకిలారావాల కంటే ముందే గ్రామాల్లో, పట్టణాల్లో ఒక వింత నిశ్శబ్దం అలుముకుని ఉంటుంది. కానీ ఆ రోజు మాత్రం వాతావరణంలో ఏదో తెలియని ఉద్వేగం. అది ఎన్నికల ఉదయం!ఆకాశంలో నారింజ రంగు వెలుగు ఇంకా పూర్తిగా పరుచుకోకముందే, పోలింగ్ కేంద్రాల బయట పాములా మెలికలు తిరుగుతున్న క్యూ లైన్లు కనిపిస్తాయి. ఆ లైన్ లో అందరూ సమానమే. అక్కడ హోదా లేదు, ఆస్తిపాస్తుల పట్టింపు లేదు.**



ఆ క్యూలో రిక్షా తొక్కుతూ ఒళ్ళంతా హూనం చేసుకునే రాజయ్య ఉన్నాడు, ఎండనక వాననక పొలం కాపలా కాస్తూ, మట్టినే నమ్ముకున్న లక్ష్మమ్మ ఉంది, కండలు కరిగించి మేడలు కట్టే మేస్త్రీ సోమయ్య ఉన్నాడు, చిరిగిన చెప్పులను కుడుతూ, జీవితపు అతుకులను సరిచేసుకునే ముసలి నరసయ్య ఉన్నాడు.వీరందరూ తమ వంతు కోసం వేచి చూస్తున్నారు. వారి చేతుల్లో ఉన్న ఓటరు కార్డు వారి ఆత్మగౌరవ ప్రతీక. లోపలికి వెళ్లి, ఆ యంత్రం మీద తమకు నచ్చిన గుర్తును నొక్కినప్పుడు కలిగే తృప్తి వర్ణనాతీతం. ఆ క్షణంలో రాజయ్యకు, నరసయ్యకు ఒక గర్వం కలుగుతుంది. తమ వేలికి పడిన ఆ నీలి రంగు సిరా చుక్కను చూసుకుని వాళ్ళు మురిసిపోతారు. ఈ దేశాన్ని నడిపించే సత్తా నా వేలికి ఉంది, నా ఓటుతో నేను చరిత్రను మారుస్తాను అన్న ఆశ వారి కళ్ళలో మెరుస్తుంది.ఫలితాలు వస్తాయి. గెలిచిన నాయకుడి ఇంటి ముందు బాణసంచా పేలుతుంది. పూలమాలలు, రంగుల జెండాలు, గెలుపు నినాదాలు మిన్నంటుతాయి. కానీ ఆ హడావుడి తగ్గాక మళ్ళీ అదే పాత నిశ్శబ్దం!రాజయ్య మళ్ళీ తన పాత రిక్షాను బయటకు తీస్తాడు. లక్ష్మమ్మ మునుపటి లాగే చెమటలు చిందుస్తూ పొలానికి వెళ్తుంది. సోమయ్య కూలి పనుల కోసం అడ్డా దగ్గర నిలబడతాడు. నరసయ్య తన కుట్టు మిషన్ ముందు కూర్చుంటాడు. ఎన్నికల రోజున వాగ్దానాలు చేసిన నాయకులు ఇప్పుడు ఏసీ గదుల్లో మెరుస్తుంటారు, కానీ ఈ సామాన్యుల జీవితాలు మాత్రం గాలికెగిరిన కాగితాల్లా అక్కడే ఉండిపోతాయి. వారి పేదరికం ఇంచు కూడా కదలదు, వారి పిల్లల భవిష్యత్తు చీకట్లోనే మగ్గిపోతుంది. ఐదు సంవత్సరాల పాటు ఆ రాజయ్య ఓటు విలువ అక్షరాలా సున్నా!నిజానికి మన దేశంలో ఎన్నికలు అంటే ఒక ప్రజాస్వామ్య పండుగ అంటారు, కానీ అది ఒక మాయా విక్రయం గా మారిపోయింది. ఎన్నికల ముందు గల్లీల్లో కార్యకర్తల సందడి మామూలుగా ఉండదు. బియ్యం బస్తాలు, రంగుల చీరలు, మందు సీసాలు, గుట్టుచప్పుడు కాకుండా చేతులు మారే నగదు నోట్లు ఇవి పేదవాడి ఆకలిని, అవసరాన్ని పెట్టుబడిగా మార్చుకుంటాయి.

ఒక పేద ఓటరు ఆ క్షణంలో తప్పు చేస్తున్నానని అనుకోడు. ఎవరు గెలిచినా మనకేం వస్తుంది? కనీసం ఈ ఐదు వందలైనా ఇప్పుడొస్తున్నాయి కదా అన్నది అతని వేదన. ఒక పేద కుటుంబానికి ఐదు వందల రూపాయలు అంటే రెండు రోజుల కష్టార్జితం. ఆ డబ్బుతో వాళ్ళు ఆ రోజు కడుపు నిండా భోజనం చేయగలరు. కాబట్టి దీన్ని కేవలం నైతిక పతనంగా చూడలేం; ఇది వ్యవస్థ సృష్టించిన ఆర్థిక ఒత్తిడి. పేదవాడు తన ఓటును అమ్మడం లేదు, తన జీవితం మీద ఆశ వదిలేసుకుని ఒక తాత్కాలిక ఉపశమనాన్ని పొందుతున్నాడు. ఎందుకంటే, ఎవరికి ఓటు వేసినా తన బతుకు మారదు అనే చేదు నిజాన్ని అతను దశాబ్దాలుగా అనుభవిస్తూనే ఉన్నాడు.ఎన్నికల ప్రచారంలో నేతలు వేదికల మీద ఊగిపోతూ మాట్లాడతారు. మీరే నా బలం, మీ బిడ్డగా మీ కష్టాలు తీరుస్తా అని కన్నీరు పెట్టుకుంటారు. సామాన్యులు ఆ మాటలకు కరిగిపోతారు. కానీ గెలిచిన మరుక్షణమే ఆ నేత ప్రయాణించే కారు మారుతుంది, చుట్టూ ఉండే భద్రతా వలయం మారుతుంది, చివరకు మాట్లాడే భాష కూడా మారిపోతుంది.ఒకప్పుడు తన భుజం మీద చేయి వేసి పలకరించిన నేతను కలవడానికి రాజయ్య వెళితే సారు బిజీగా ఉన్నారు, అపాయింట్‌మెంట్ లేదు అని అనుచరులు తోసేస్తారు. ఆ ఐదేళ్ల కాలంలో రాజయ్యకు పాలనలో ఎలాంటి భాగస్వామ్యం ఉండదు. కేవలం వార్తాపత్రికల్లో తన గ్రామంలో రోడ్డు వేస్తున్నట్లు లేదా ఫ్లై ఓవర్ ప్రారంభించినట్లు ఫోటోలు చూసి మురిసిపోవడమే. కానీ వాస్తవానికి అతని ఊరిలో రోడ్లు గుంతలమయంగానే ఉంటాయి, ఆసుపత్రిలో కనీసం పారాసిటమాల్ బిళ్ళ కూడా దొరకదు. అభివృద్ధి అనేది కాగితాల్లో తప్ప, పేదవాడి కంచంలోకి చేరదు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, బడ్జెట్ కేటాయింపులు, నాయకుల పనితీరుకు సంబంధించిన నిజమైన గణాంకాలు పేదవారికి చేరవు. టీవీ ఛానళ్లు రాజకీయ రంగులనే ప్రసారం చేస్తాయి తప్ప, వాస్తవాలను కాదు. కార్పొరేట్ దిగ్గజాలకు లాబీయిస్టులు ఉంటారు, కానీ రాజయ్యలు, సోమయ్యలు చెల్లాచెదురుగా ఉన్నారు. రాజకీయ పార్టీలు వీరిని కేవలం ఒక ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తాయి.కడుపు నిండిన వాడు హక్కుల గురించి పోరాడతాడు, కానీ పూట గడవని వాడు ఆ రోజు పని దొరుకుతుందా లేదా అని ఆలోచిస్తాడు.ప్రజాధనం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళు తుందో తెలియని పరిస్థితి. అభివృద్ధి జరుగుతున్నట్లు బిల్లులు పాస్ అవుతాయి, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటుంది.ఇదంతా చూసి ఓటు వేయడం దండగ అని అనుకుంటే అది మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుంది. ఓటు అనేది కేవలం ఎన్నికల రోజున వేసే ముద్ర కాదు; అది ఐదేళ్ల పాటు నాయకుడిని ప్రశ్నించే లైసెన్స్.పేద పిల్లలు చదువుకోవాలి. చదువుకున్న వాడు ప్రశ్న అడుగుతాడు, తన హక్కులు ఏమిటో గ్రహిస్తాడు. ఒక తరం విద్యావంతమైతే, ఆ తర్వాత తరం ఓటును ఎవ్వరూ కొనలేరు. పంచాయతీలు, గ్రామ సభలు సజీవంగా ఉండాలి. బడా నాయకుల కంటే తమ కంటికి కనిపించే సర్పంచ్‌ను, వార్డు మెంబర్‌ను నిలదీయగలిగే ధైర్యం ప్రజల్లో రావాలి. సమాచార హక్కు చట్టం గురించి ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలి. మా ఊరికి వచ్చిన నిధులు ఏమయ్యాయి?అని ప్రశ్నించిన రోజున ఏ నాయకుడూ నిర్లక్ష్యంగా ఉండలేడు.కేవలం జెండాలు మోయడానికే కాకుండా, వ్యవస్థలో మార్పు తేవడానికి విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి ముందడుగు వేయాలి.ప్రజాస్వామ్యం అంటే కేవలం పాలకులు మారడం కాదు, పాలన సామాన్యుడి ముంగిట తలవంచడం! రాజయ్య ఓటు వేసినప్పుడు ఉన్న ఆ గర్వం ఐదేళ్ల పాటు అతని కళ్ళలో నిలవాలంటే, మనం కేవలం ఓటర్లుగానే కాదు.. బాధ్యతాయుతమైన పౌరులుగా మారాలి. మన మౌనం పాలకులకు బలం అవుతుంది, మన ప్రశ్న వారిలో జవాబుదారీతనాన్ని పెంచుతుంది.ఎన్నికల సిరా వేలి మీద ఆరిపోయినా, మన హక్కుల నిప్పు గుండెల్లో ఆరిపోకూడదు! రాజయ్య రిక్షా టైర్లు అరిగిపోవచ్చు, కానీ ప్రతినిధిని ప్రశ్నించే అతని గొంతు ఎప్పుడూ పదునుగానే ఉండాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఆ మార్పు మనతోనే మొదలవ్వాలి!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# ఒకప్పుడు రోజుకు రూ.250 .. ఇప్పుడు నెలకు రూ.90 వేలు..

సొంత ఇల్లు.. చాలామందికి అది ఓ సాధారణ కల. కానీ ఢిల్లీకి చెందిన ఓ లస్సీ విక్రేతకు మాత్రం అది జీవితాంతం వెంటాడిన కోరిక. చిన్నతనంలో తండ్రిని కోల్పోయాడు. ఉండేందుకు సొంత ఇల్లు కూడా లేదు. 11 ఏళ్ల వయసులోనే కుటుంబ బాధ్యతలు భుజాన వేసుకున్నాడు. ఇప్పుడు అదే వ్యక్తి కష్టపడి తన కుటుంబానికి సొంతింటిని నిర్మించుకున్నాడు.

**11 ఏళ్ల నుంచే పనికి**

డిజిటల్ క్రియేటర్ ఉపేన్ వర్మతో జరిగిన ఇంటర్వ్యూలో లస్సీ విక్రేత తన జీవిత కథను పంచుకున్నాడు. దేవుడిని ఒక కోరిక కోరుకునే అవకాశం వస్తే ఏం అడుగుతావని వర్మ ప్రశ్నించాడు. అందుకు అతడు 'నా తండ్రి జీవితం' అని సమాధానం ఇచ్చాడు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయినట్లు చెప్పాడు. ఆ సమయంలో తమకు ఉండేందుకు ఇల్లు కూడా లేదని గుర్తుచేసుకున్నాడు. 11 ఏళ్ల వయసు నుంచే కష్టపడుతున్నానని తెలిపాడు. కుటుంబాన్ని ఆదుకునేందుకు అప్పుడే పనిలోకి దిగాల్సి వచ్చిందన్నాడు.

**కుటుంబం కోసం పోరాటం**



ఏళ్ల తరబడి కష్టపడుతూ తన కుటుంబానికి అండగా నిలిచాడు. తోబుట్టువుల వివాహాలు చేశాడు. తర్వాత తనకంటూ ఓ కుటుంబాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అయితే సొంతింటి కల మాత్రం అతడిని వెంటాడుతూనే ఉం. రూ.250 నుంచి రూ.90 వేల వరకు తండ్రి జీవించి ఉన్న సమయంలో రోజుకు సుమారు రూ.250 సంపాదించేవాడినని అతడు చెప్పాడు. ప్రస్తుతం ఢిల్లీలో లస్సీ విక్రయిస్తూ నెలకు రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు సంపాదిస్తున్నట్లు తెలిపాడు. ఆ ఆదాయంతో ఉత్తర్‌ప్రదేశ్‌లో తన కుటుంబం కోసం సొంతింటిని నిర్మించుకున్నాడు.

**ఒక్క మాటతో ప్రేరణ**

జీవితంలో ఏదీ అనుకున్నట్లుగా జరగడం లేదని భావించే వారికి ఏం చెబుతావని అడిగితే.. అతడు చాలా సూటిగా సమాధానం చెప్పాడు. 'కష్టపడండి' అని సలహా ఇచ్చాడు. కష్టపడటం అలవాటు చేసుకుంటే ఏదో ఒక రోజు మంచి స్థాయికి చేరుకుంటారని అన్నాడు. ఈ సంభాషణను ఉపేన్ వర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు. సాధారణంగా సాగిన ఈ సంభాషణ తనకు గుర్తుండిపోయే అనుభవంగా మారిందని పేర్కొన్నాడు. వీడియో చూసిన పలువురు అతడి కష్టాన్ని ప్రశంసించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 20-8-2026



# యూనిఫాం వస్త్రాలను భద్రపరిచిన హత్నూర ఐకెపి అధికారులు

## క్రైమ్ మిర్రర్ వార్తకు స్పందన..








**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం తయారీ కోసం ఉంచిన వస్త్రాలు హత్నూర ఐకెపి కార్యాలయంలో నిర్లక్ష్యంగా పడిఉన్న విషయంపై బుధవారం క్రైమ్ మిర్రర్ లో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. హత్నూర ఐకెపి కార్యాలయంలో చెల్లాచెదురుగా ఉన్న యూనిఫాం వస్త్రాలను గుర్తించి, వాటిని సక్రమంగా ఒకచోట చేర్చి భద్రపరిచారు. వస్త్రాలు దుమ్ము, ధూళి, ఎలుకల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యార్థులకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ సామగ్రి వృథా కాకుండా చర్యలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వార్త ప్రచురితమైన అనంతరం అధికారులు స్పందించి వస్త్రాలను భద్రపరచడం గమనార్హం.

# చరిత్రకు సజీవ సాక్ష్యం ఫోటో



### ఒక్క ఫోటో వెయ్యి మాటల నిజాన్ని చూపించే శక్తి ఫోటో జర్నలిస్టులది జిల్లా ఎస్పీ:సునిత రెడ్డి,

### చరిత్రకు సజీవ సాక్ష్యాలు.. తరతరాలకు జ్ఞాపకాల వారధులు ఫోటోలులి

### సృజనాత్మకతతో సమాజాన్ని చైతన్యపరిచే శక్తి ఫోటోగ్రఫీ

**వనపర్తి ప్రతినిధి:** వనపర్తి బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ఫోటో జర్నలిస్ట్ లతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీసునిత రెడ్డి. కేక్ కట్ చేసి ఫోటో జర్నలిస్టులకు శాలువాతో సన్మానించి అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఒక్క ఫోటో వెయ్యి మాటలకు సమానం. ఒక క్షణాన్ని బంధించే కెమెరా.. ఆ క్షణాన్ని చరిత్రగా నిలబెట్టే శక్తిని కలిగి ఉంటుంది. సమాజంలో జరిగే ప్రతి సంఘటనకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తూ, నిజాన్ని ఎలాంటి భేషజం లేకుండా ప్రజల కళ్లముందుంచే శక్తివంతమైన మాధ్యమం ఫోటో జర్నలిజం ఫోటోగ్రఫీ కేవలం ఒక కళ మాత్రమే కాదు.. అది చరిత్రను భద్రపరిచే బాధ్యత, సమాజాన్ని ప్రతిబింబించే అద్దం, వాస్తవాలను వెలుగులోకి తెచ్చే ఆయుధం. మన సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక మార్పులు, ప్రజల జీవన విధానం, కీలక సంఘటనలు.. ఇవన్నింటినీ భావితరాలకు అందించే సజీవ దస్తావేజులు ఛాయాచిత్రాలు. ఒక మంచి ఫోటోలో ఒక కథ ఉంటుంది.. ఒక భావోద్వేగం ఉంటుంది.. ఒక సందేశం ఉంటుంది.. ఒక చరిత్ర ఉంటుంది. ముఖ్యంగా ఫోటో జర్నలిస్టులు ప్రతికూల పరిస్థితుల్లోనూ సంఘటనలను ప్రజల ముందుకు తీసుకురావడంలో చేస్తున్న కృషి అభినందనీయం. సమాజానికి వాస్తవాలను చూపిస్తూ ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడంలో వారి పాత్ర ఎంతో కీలకం. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటో జర్నలిస్టులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ కెమెరా ఎల్లప్పుడూ నిజాన్ని బంధిస్తూ.. సమాజానికి స్ఫూర్తినిచ్చే చిత్రాలను ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, డిసిఆర్బి డిఎస్పి, బాలాజీ నాయక్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు, అన్ని పత్రికల ఫోటో జర్నలిస్టులు, రాము, బాలరాజు, యూసుఫ్ యాదిరెడ్డి, లోకేష్, శ్రీకాంత్, మహేష్, ఆంజనేయులు, జ్ఞానమూర్తి వినోద్ తదితరులు పాల్గొన్నారు



## ఆర్కేపీ ఓసీపీ ఫేజ్-2కు పరిహార అటవీ భూమిపై స్థల పరిశీలన

**మందమర్రి: ఆగస్టు 19 (క్రైమ్ మిర్రర్) :** రామకృష్ణాపూర్ ఉపరితల గని (ఆర్కేపీ ఓసీపీ) ఫేజ్-2కు అవసరమైన అటవీ భూమికి బదులుగా పరిహార అటవీ పెంపకానికి ప్రతిపాదించిన భూమిని అటవీ, సింగరేణి అధికారులు బుధవారం పరిశీలించారు. కేకే ఓసీపీ పరిధిలో సింగరేణి సేకరించిన డంప్ భూమిలో 366.4198 హెక్టార్లను పరిహార అటవీ పెంపకానికి ప్రతిపాదించారు. అటవీ సంరక్షణాధికారి, ఫీల్డ్ డైరెక్టర్ ఎస్. శాంతారామ్, ఐఎఫ్ఎస్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిసాన్ జాధవ్, ఐఎఫ్ఎస్, ఎఫ్డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్వో రత్నాకర్ తదితరులు మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. భూమి విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, మట్టి నాణ్యత, నీటి లభ్యత, రవాణా సౌకర్యాలు, అటవీ పెంపకానికి అనుకూలత తదితర అంశాలను పరిశీలించారు. పరిహార అటవీ పెంపకానికి భూమి అనుకూలతపై అధికారులు సాంకేతికంగా పరిశీలించి అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణ మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. గనుల విస్తరణతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని, అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే పనులు చేపడతామని సింగరేణి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం జీఎల్ ప్రసాద్, కేకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి రాంబాబు, డీజీఎం సర్వే దేశాయ్, ఫారెస్ట్ అధికారి నవీన్, ఎస్టేట్ అధికారి నవనీత, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకట్‌రెడ్డి, కేకే ఓసీపీ మేనేజర్ రామరాజు, జూనియర్ సర్వే అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతినగర్ రోడ్లు చెత్తకుప్పగా మారాయి....

### జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంపై తెలంగాణ రక్షణ సేన ఆగ్రహం....


**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి ప్రతినిధి :** సైబరాబాద్ మున్సిపాల్ కమీషనరేట్ శేరిలింగంపల్లి జోన్ లో ని గోపీనగర్, ప్రశాంతినగర్, ఆదర్శనగర్ కాలనీల్లో రోడ్లపై చెత్త పేరుకుపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ సీనియర్ నాయకుడు మురుగేషన్ వేలు ఆరోపించారు. కొందరు వ్యక్తులు వాహనాల్లో చెత్తను తీసుకొచ్చి రోడ్లపై పడేస్తున్నారని, గత వారం రోజులుగా ప్లాస్టిక్, తినుబండారాల వ్యర్థాలు పోగుపడ్డాయని తెలిపారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, దుర్వాసనతో పాటు సమీపంలోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై చెత్త వేయడం ప్రజల తప్పు అయినప్పటికీ, జీహెచ్ఎంసీ అధికారులు నిరంతరం పర్యవేక్షించి వెంటనే చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. 24 గంటల్లో సమస్య పరిష్కరించకపోతే చెత్తతో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## మియాపూర్ లో "సురక్షా తిరంగా" సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం.....



**క్రైమ్ మిర్రర్ మియాపూర్ ప్రతినిధి :** "సురక్షా తిరంగా" కార్యక్రమంలో భాగంగా మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మదీనగూడ నారాయణ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్ లింకులు, ఫేక్ ఓటీపీ లు, లోన్ యాప్ మోసాలు, బెట్టింగ్ యాప్ మోసాలు, సోషల్ మీడియా భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ , బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ కు, అత్యవసర సహాయం కోసం 112కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ విజయ్ నాయక్, సైబర్ వారియర్ సూర్యతేజ, పెట్రోల్ కారు సిబ్బంది పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595




# ధర్మారెడ్డి కాలువ మట్టి అక్రమ తరలింపు.?

### ప్రమాదకర పరిస్థితిలో ధర్మారెడ్డి కాలువ..!

### పనులు నిలిపివేశాం - విచారణ చేపడతాం - ఎమ్మార్వో



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీ ఒకటో వార్డు శివనేని గూడెం పరిధిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. కొందరు వ్యక్తులు ధర్మారెడ్డి కాల్వ మట్టిని ఎలాంటి అనుమతి లేకుండా జాతీయ రహదారి 65 నిర్మాణానికి తరలిస్తున్నారు. పేరుకేమో అధికారిక పనులు కానీ ఆ పనులకు ఉపయోగించే మట్టి మాత్రం అక్రమం అన్నట్లు ఉంది ప్రస్తుత పరిస్థితి. శివనేని గూడెం నుండి వనిపాకల మీదుగా టిప్పర్లతో అనుమతులు తుంగలో తొక్కి మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలతో పలుమార్లు ప్రజలు హెచ్చరించినా సదరు వ్యక్తులు(కా...ర్లు) పట్టించుకోకుండా షరామామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఒక కాలువకు సంబంధిన మట్టిని తరలిస్తే కాలువ నిర్మాణం దెబ్బతినే అవకాశం ఉంది అన్ని తెలుసు కూడా చేయడం నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుంది. ఇదే విషయమై చిట్యాల ఎమ్మార్వో విజయ్ కుమార్ ను వివరణ కోరగా అనుమతులు లేకుండా మట్టి తరలించడంపై సదరు కాంట్రాక్టర్ లను హెచ్చరించడం జరిగిందని వెంటనే పనులు ఆపివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఘటనా స్థలాన్ని పరిశీలించిన తరువాత విచారణ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అక్రమ మట్టి తరలింపు విషయం బయటకు రావడంతో పనులను ఆపివేసి వాహనాలను తరలించడం కొసమెరుపు...

# గుండాలలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

### జెండా ఆవిష్కరణ.. లూయిస్ డాగురెకు నివాళి

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, క్రైమ్ మిర్రర్:** గుండాల మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం ఫోటోగ్రఫీ రంగానికి ఆద్యుడైన శ్రీ లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫోటోగ్రఫీ ద్వారా సమాజంలో జరుగుతున్న అనేక ఘటనలను చరిత్రలో పదిలంగా నిలుపుతున్న ఫోటో, వీడియో గ్రాఫర్ల సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉంటూ వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం.డి. సమ్మద్ పాషా, ఉపాధ్యక్షుడు దుడుక దిలీప్, ప్రధాన కార్యదర్శి ఎలికట్టి మహేష్, కోశాధికారి గుగ్గిళ్ల సురేష్, కుటుంబ భరోసా ఇన్‌చార్జి మన్నూరు వెంకన్న, గౌరవ అధ్యక్షుడు గౌలికరి యుగంధర్‌తో పాటు ఎలగందుల స్వామి, కొడపర్తి భాస్కర్, దార బాలరాజు, ఎల్లికట్టి ప్రశాంత్, నారగాని యాదగిరి, కొలిపాక నరసింహా, కూరెళ్ల స్వామి, నరేష్, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# లక్డారం దళిత రైతుల భూములకు న్యాయం చేయాలి: సిపిఎం

- రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం
- భూమికి భూమి లేదా తగిన నష్టపరిహారం ఇవ్వాలి
- పోలీసు పహారాలో ఫెన్సింగ్ ఏర్పాటుపై సిపిఎం ఆగ్రహం
- నోటీసులు, నష్టపరిహారం లేకుండా భూములు తీసుకోవడం సరికాదు
- ఎస్టిపి తో లక్డారం, చిట్కుల్, రుద్రారం, బేగంపేట్, చిదురుప్ప జలాలు కలుషితమయ్యే ప్రమాదం
- పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్




**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19:** లక్డారం గ్రామ దళిత రైతుల భూముల్లో ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటును నిలిపివేసి, రైతులకు భూమికి భూమి లేదా తగిన నష్టపరిహారం అందేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. జయరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో రైతులు సాగు చేస్తున్న భూములను పార్టీ నాయకులు, గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ.. లక్డారం గ్రామంలోని సర్వే నంబర్ 498లో 1970లో అప్పటి ప్రభుత్వం 25 కుటుంబాలకు ఎకరం చొప్పున 23 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. అప్పటి నుంచి రైతులు ఈ భూముల్లో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 2015 నుంచి అధికారులు ఈ భూములను ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ, రైతులకు హక్కులు లేవని చెబుతూ ఎస్టిపి ప్లాంట్ కోసం 10 ఎకరాలను కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత మూడు రోజులుగా పోలీసుల పహారా మధ్య నాలుగు జేసీబీలతో 10 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా భూములను స్వాధీనం చేసుకోవడం సరికాదన్నారు. 2013 భూసేకరణ చట్టంలోని నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు వల్ల లక్డారం, చిట్కుల్, రుద్రారం, బేగంపేట్, చిదురుప్ప తదితర గ్రామాల నీరు, భూములు కలుషితమయ్యే ప్రమాదం ఉందని జయరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత జలాలు నక్కవాగు ద్వారా మంజీరా నదిలోకి చేరితే సింగూరు జలాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు ముందు గ్రామ ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యను వెంటనే పరిష్కరించి, పోలీసుల జోక్యాన్ని నివారించాలని ఆయన కోరారు. అనంతరం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. నర్సింలు, జిల్లా కమిటీ సభ్యుడు బి. నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు ఎండి. వాజిద్ అలీ, జిల్లా నాయకులు పి. అశోక్, కంజర్ల మల్లేశం, కె. మాణిక్య ప్రభు, కంచర్ల రవి, కంజర్ల నరసింహులు, భాగయ్య, ఇస్నాపురం మల్లేశం, ఏ. రాఘవేందర్, బలరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు ఎందుకు తరుముకుంటున్నారు చైర్మన్ గారు....

### బిఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ కొత్తపాటి సతీష్

**చండూరు, క్రైమ్ మిర్రర్:** మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గుమ్మడికాయ దొంగ అంటే చండూరు చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ఎందుకు భుజాలు తడుముకుంటున్నారంటూ బిఆర్ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ కొత్త పాటి సతీష్ ఎద్దేవా చేశారు. బుధవారం చండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చండూరులో బిఆర్ఎస్ చేపట్టిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బస్ షెల్టర్ నిర్మాణ చోటును మార్చడంలో అవినీతి జరిగిందని డబ్బులు ఇచ్చిన వారికి....తీసుకున్న వాళ్లకు.... మరియు ఆ భగవంతునికే తెలియాలని అన్నారే తప్ప ఎవరిని ఉద్దేశపూర్వకంగా ఆరోపించలేదని.... కానీ చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు రాద్ధాంతం చేస్తూ దేవుడి గుడిలో ప్రమాణాలు అంటూ మాట్లాడడం సరికాదన్నారు. నిజంగా మీరు నిజాయితీపరులు అయితే మీరు ప్రమాణం చేయాలని మీ నిజాయితీ నిరూపించుకోవాలని సూచించారు. డిసిసి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి పైన కూడా అనేక ఆరోపణలు వచ్చాయని ఆయనను కూడా తీసుకొచ్చి గుడిలో ప్రమాణం చేయించాలని హితవు పలికారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి హయాంలోనే నియోజవర్గంలో అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని.... చండూరు మున్సిపల్ ఏర్పాటు, గట్టుప్పల మండలం, ఇలా అనేక విధాలుగా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తు చేశారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగోని వెంకన్న గౌడ్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తో సహా ఇతర అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయని అసమర్థులు ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులని ఎద్దేవా చేశారు. మరో ముఖ్య నేత ఇరిగి రామన్న మాట్లాడుతూ ప్రమాణాలు అంటేనే దేవుళ్ళు భయపడే కాడికి ఈ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీసుకొచ్చారని విమర్శించారు. అయ్యప్ప గుడిని సొంత ఖర్చులతో పూర్తి చేస్తానన్న వ్యక్తులు ఇప్పుడు చందాలు ఎందుకు వసూలు చేస్తున్నారంటూ ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మధు, బొడ్డు సతీష్ కుమార్ రాపోలు జగదీశ్వర్, తేలుకుంట్ల శేఖర్, యాదిరెడ్డి, పెండ్యాల గీత, తేలుకుంట్ల జానయ్య, ఇరిగి రామకృష్ణ, నరేష్, చొప్పరి దశరథ, తాందారి రవి, స్వామి తదితరులు పాల్గొన్నారు.


## అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలి



**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల:** చేవెళ్ల మండలం కుమ్మెర గ్రామంలో అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా మసీదు నిర్మాణానికి పునాదులు వేస్తున్నారని బజరంగ్‌దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ ఆరోపించారు. బుధవారం నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, ఎలాంటి అనుమతులు లేవని గ్రామ కార్యదర్శి కరుణాకర్ స్పష్టం చేసినప్పటికీ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గూడెం రమేష్ అధికారులను డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మప్రచార్ రాఘవేంద్రచారి, బజరంగ్‌దళ్ కార్యకర్తలు మహేంద్ర, వడ్ల అక్షయ్, మాజీ సర్పంచ్ భానుతేజ, చెన్నోల శ్రీనివాస్, కావలి లక్ష్మీనారాయణ, కావలి కుమార్, బోనగిరి దర్శన్, చంద్రశేఖర్‌రెడ్డి, చాకలి శ్రీకాంత్, కావలి వెంకటేశం, బోధే విష్ణువర్ధన్‌రెడ్డి, బాధే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా భగ్నం.....



### రూ.16.40 లక్షల ఎండీఎంఏ ,ఓజీ కుష్, స్వాధీనం.....

### ముగ్గురు పెడ్లర్లు అరెస్ట్......

క్రైమ్ మిర్రర్ సైబరాబాద్ ప్రతినిధి : గచ్చిబౌలి పోలీసులు, సైబరాబాద్ ఎస్ఓటీ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టురట్టైంది. ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్ మీడియాకు వెల్లడించారు. ఈ నెల 11న వట్టినాగులపల్లిలోని కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద 16 మంది వినియోగదారులతో కలిసి డ్రగ్స్ సేవించేందుకు సిద్ధమైన కొరిపెల్ల యశ్వంత్ సాయి షణ్ముఖ్ (26)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కేరళకు చెందిన మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్ (26), బెంగళూరులో నివసిస్తున్న నవీనా కేడీ (22) నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించాడు. దీంతో ప్రత్యేక బృందాలు కేరళ, బెంగళూరులకు వెళ్లి ఈ నెల 18న రజల్ అబ్దుల్ గఫూర్, నవీనా కేడీలను అరెస్టు చేశాయి. విచారణలో నైజీరియన్ జాతీయుడైన 'సామ్' నుంచి ఎండీఎంఏ, కేరళకు చెందిన 'అనేశ్వర్' నుంచి ఓజీ కుష్ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నట్లు తేలింది. రజల్ అబ్దుల్ గఫూర్ స్వస్థలం త్రిస్సూర్, ప్రస్తుతం బెంగళూరులోని బేగూరులో వ్యాపారం చేస్తున్నాడు. నవీనా కేడీ స్వస్థలం కూడా త్రిస్సూర్ కాగా, ఆమె బేగూరులో వ్యాపారం చేస్తోంది. యశ్వంత్ సాయి షణ్ముఖ్ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూసాపేటలో ఉంటున్నాడు. నిందితుల నుంచి రూ.11,40,920 విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, రూ.5 లక్షల విలువైన 50 గ్రాముల ఓజీ కుష్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి సరఫరాకు సంబంధించిన సమాచారం ఉంటే ప్రజలు డయల్ 112 లేదా సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 8712663061కు సమాచారం అందించాలని డీసీపీ కోరారు. సమాచారం ఇచ్చేవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఆపరేషన్‌లో ప్రతిభ చూపిన ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసు సిబ్బందిని డీసీపీ అభినందించారు.



## అభివృద్ధి విద్యకు ఉపయోగపడాలి భద్రాద్రి ఫోటోగ్రాఫర్స్.

### ఫోటోగ్రాఫర్లకు న్యాయం జరగాలి

**భద్రాద్రి కొత్తగూడెం ఆగష్టు 19:** టెక్నాలజీ అభివృద్ధి చెందడం తప్పు కాదు. ఆధునిక సాంకేతికతను విద్యకు, ఉపాధికి, నైపుణ్యాభివృద్ధికి, యువత భవిష్యత్తుకు ఉపయోగించుకుంటే సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. కానీ, టెక్నాలజీ పేరుతో సంవత్సరాలుగా ఒక కళగా, ఒక వృత్తిగా కొనసాగుతున్న ఫోటోగ్రఫీపై ఒత్తిడి పెరగడం మాత్రం చాలా బాధాకరం. ఒకప్పుడు ఫోటోగ్రాఫర్లపై ఆధారపడిన అనేక పనులు నేడు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా మరియు ఇతర సాంకేతిక మార్పుల వల్ల తగ్గిపోతున్నాయి. దీనివల్ల ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది ఫోటోగ్రాఫర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోంది. టెక్నాలజీని ఆపడం మా ఉద్దేశం కాదు. టెక్నాలజీ అభివృద్ధి చెందాలి, కానీ దాని వల్ల ఒక వృత్తి పూర్తిగా దెబ్బతినకూడదు. కొత్త టెక్నాలజీతో పాటు వృత్తి ఫోటోగ్రాఫర్లకు కూడా ఆధునిక శిక్షణ, కొత్త పరికరాలపై అవగాహన, ప్రభుత్వ ప్రోత్సాహం, ఉపాధి అవకాశాలు మరియు ప్రత్యేక సంక్షేమ పథకాలు అందించాలి. ప్రభుత్వం సోషల్ మీడియా రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లుగానే, సమాజంలోని ముఖ్యమైన క్షణాలను తమ కెమెరాల్లో శాశ్వతంగా నిలుపుతున్న వృత్తి ఫోటోగ్రాఫర్లను కూడా గుర్తించి ఆదుకోవాలి.

మా మనవి ఒక్కటే--- టెక్నాలజీ అభివృద్ధి చెందాలి...

విద్యకు, ఉపాధికి ఉపయోగపడాలి...

కానీ ఫోటోగ్రాఫర్ల వృత్తిపై భారం కాకూడదు. ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి, ఫోటోగ్రాఫర్లకు ప్రత్యేక ప్రోత్సాహం, ఆధునిక శిక్షణ మరియు సంక్షేమ కార్యక్రమాలు అందించి ఈ వృత్తిని ఆదుకోవాలని ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా మనవి చేస్తున్నాము. ఫోటోగ్రఫీ ఒక కళ మాత్రమే కాదు... ఎన్నో కుటుంబాలకు జీవనాధారం కూడా.

## లక్డారం రైతుల కేసుపై రెండో రోజూ హైకోర్టులో వాదనలు

### రైతుల భూములు, పంటలకు రక్షణ కల్పించాలని కోరిన అడ్వకేట్ ఐలాపూర్ మాణిక్ యాదవ్




పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19: లక్డారం రైతుల భూముల సమస్యపై హైకోర్టులో వరుసగా రెండో రోజు కూడా సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. రైతుల తరఫున హైకోర్టు అడ్వకేట్ ఐలాపూర్ మాణిక్ యాదవ్ రైతుల సమస్యలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు లక్డారం ప్రాంతానికి వచ్చి రైతులు సాగు చేస్తున్న పంటలను నాశనం చేసిన ఘటనను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల భూములు, పంటలకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోర్టును కోరారు. రెండో రోజు విచారణలో ఇరుపక్షాల వాదనలు సుదీర్ఘంగా కొనసాగగా.. తదుపరి విచారణను హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ సందర్భంగా అడ్వకేట్ ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరిగే వరకు, వారి భూముల హక్కుల పరిరక్షణ కోసం చట్టపరంగా చివరి వరకు పోరాడుతానని తెలిపారు. రైతుల హక్కులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు.

## హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉంది : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

### పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని సందర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్




**కూకట్ పల్లి, ఆగస్టు 19 (క్రైమ్ మిర్రర్):** ?హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకుడు వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి ఎల్లమ్మబండలోని పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను సంఘం నిర్వాహకుల నుంచి అడిగి తెలుసుకున్నారు. తను కూకట్ పల్లి డిప్యూటీ కమిషనర్ గా పని చేసినప్పుడు ఎల్లమ్మబండ కాలనీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు గుర్తు చేశారు. పాలమూరు జిల్లా అంటేనే వలస కార్మికుల జిల్లా అని పేరుంది, ఎల్లమ్మబండతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పాలమూరు వాసులు నివాసం ఉంటున్నారని అన్నారు. హైదరాబాద్ మహానగర నిర్మాణంలో, అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు వలసలు తగ్గాయి, పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల ద్వారా పుష్కల నీటిని అందించడంతో వలస కార్మికులు వలసల బాట మాని వ్యవసాయం చేసుకుంటున్నారని అన్నారు. పాలమూరు బిడ్డలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.ఏ. కరీమ్, ప్రధాన కార్యదర్శి గోపాస్ రవీందర్, సీనియర్ జర్నలిస్టులు ఆర్. కే. దయాసాగర్, సామల రాము, బిఆర్ఎస్ నాయకులు డి. అనిల్ రెడ్డి, కాంట్రాక్టర్ శంకర్, సంఘం వ్యవస్థాపక సభ్యులు దేవయ్య, యాదగిరి, నరసింహ, మాచర్ల భద్రయ్య, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌పుట్ డీలర్లు రైతులకు సాంకేతిక సహాయకులుగా పనిచేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**39 మంది ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్ల అందజేత.**

**ప్రత్యామ్నాయ పంటల సాగు, పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలి.**



**భద్రాద్రి కొత్తగూడెం ఆగష్టు 19:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి రైతు వేదికలో బుధవారం దేశీ శిక్షణ కోర్సును పూర్తి చేసుకున్న 39 మంది ఇన్‌పుట్ డీలర్లకు జిల్లా కలెక్టర్ అంకిత్ డిప్లొమా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇన్‌పుట్ డీలర్లు రైతులకు వ్యవసాయ సాంకేతిక సమాచారాన్ని అందించే పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్స్‌గా కీలకపాత్ర పోషించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలను రైతులకు చేరవేస్తూ, వారి ఆదాయం పెంపొందించేందుకు కృషి చేయాలని అన్నారు.జిల్లాలో పంటల మార్పిడి, ఆయిల్‌పామ్, కూరగాయలు, మిరప తదితర ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు . ఒకే రకమైన పంటలను వరుసగా సాగు చేయడం వల్ల భూసారంపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, భూసార పరిరక్షణ, సేంద్రియ కర్బనాన్ని పెంపొందించే పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా తగిన సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సుమారు 37 శాతం లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని సుమారు 2,300 చెరువుల్లో 35 శాతం కంటే తక్కువ నీటి నిల్వలు ఉన్నందున, మట్టి తేమ, భూసార పరీక్షలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలంలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉన్నందున వ్యవసాయ శాఖ, నీటిపారుదల, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు . రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఆయిల్‌పామ్, కూరగాయలు, మిరప తదితర ప్రత్యామ్నాయ పంటల సాగుతో పాటు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించే దిశగా నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇన్‌పుట్ డీలర్లు తమ వ్యాపారంతో పాటు వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను రైతులకు చేరవేసి అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించాలని తెలిపారు.దేశీ శిక్షణలో ప్రతిభ కనబరిచిన గుడిపాటి విజయభాస్కర్ గోల్డ్ మెడల్, అనగారి కళ్యాణ్ సిల్వర్ మెడల్ సాధించినందుకు జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను జిల్లా కలెక్టర్ అంకిత్ తన చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకొని ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు.

# పోలీస్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి

**వార్షిక తనిఖీల్లో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**





**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19:** పోలీస్ సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి స్థాయి పట్టు సాధించి నేరాల నియంత్రణలో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్, టౌన్ సర్కిల్ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. జహీరాబాద్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ.. డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, బ్యారక్స్, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌లో ఉన్న కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకుని, ప్రతి వాహనంపై సంబంధిత క్రైమ్ నంబర్ నమోదు చేయాలని సూచించారు. స్టేషన్ రికార్డుల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. మిస్సింగ్, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఆస్తి నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను క్రైమ్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించి పగలు, రాత్రి బీట్‌లలో నిఘా పెంచాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, సీఈఐఆర్ తదితర సాంకేతిక అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్-1 నుంచి పార్ట్-5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్-2.0లో నమోదు చేయాలని తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలని సూచించారు. గ్రామ పోలీస్ అధికారులు తమ పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం జహీరాబాద్ టౌన్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ.. పెండింగ్ కేసులు, లాంగ్ పెండింగ్ మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన కేసులను ఛేదించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దాబాలు, పెట్రోల్ బంకుల ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జహీరాబాద్ ప్రాంతం ఇతర రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండటంతో అక్రమ రవాణాకు అవకాశం ఉన్నందున సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం చేయాలని, నాకాబందీలు నిర్వహించి అక్రమ రవాణాను అడ్డుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల నిర్వహణ, రికార్డుల పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయని ఎస్పీ పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.తనిఖీల సందర్భంగా జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, సీఐ రవి, సర్కిల్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులు మంచి ఆదాయం పొందవచ్చు

**ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఆరుతడి పంటల వైపు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి**

**వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్ర మోహన్**

**కందులు. మినుములు ఆరుతడి పంటలు వేసుకోండి**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి ఆగస్టు 19 క్రైమ్ మిర్రర్:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ, ఉద్యాన శాఖ కార్యదర్శి కే. సురేంద్ర మోహన్ సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పెబ్బేరు మండలం జనంపల్లి గ్రామ శివారులోని రైతుల పొలాలను సందర్శించి పంటల సాగు పరిస్థితులను పరిశీలించారు. అనంతరం జనంపల్లి గ్రామ రైతులతో ముఖాముఖిగా మాట్లాడి పంటల సాగు, నీటి లభ్యత, ఎరువుల సరఫరా తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు బాలరాజు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తాను కందుల పంటను సాగు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించడంతో కందుల సాగు చేపట్టినట్లు చెప్పారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది గ్రామంలో వరి సాగు విస్తీర్ణం తగ్గిందని, పలువురు రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. రైతు సుగూరు కుమ్మరి వెంకటస్వామి తాను చేపట్టిన ఆయిల్‌పామ్ సాగు ద్వారా ప్రస్తుతం మంచి ఆదాయం పొందుతున్నట్లు వ్యవసాయ శాఖ కార్యదర్శికి వివరించారు. రైతులు యూరియా, ఇతర ఎరువుల సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను వ్యవసాయ శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సురేంద్ర మోహన్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా సరఫరాపై నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.అనంతరం వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, ప్రస్తుత నీటి లభ్యత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులు మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని, అర్హత ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారించాలని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో మంచి లాభాలు పొందుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న రైతు కుమ్మరి వెంకటస్వామి ని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఆయనను రైతునేస్తం కార్యక్రమంలో భాగస్వామ్యం చేసి తన అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా ఆయిల్‌పామ్ తోటల్లో వివిధ సంవత్సరాల్లో ఏయే అంతర పంటలను సాగు చేస్తే రైతులకు అధిక ఆదాయం వస్తుందనే అంశంపై అధికారులు అధ్యయనం చేసి, రైతులకు శాస్త్రీయంగా సూచనలు అందించాలని అన్నారు. ఆయిల్‌పామ్ రైతులను అంతర పంటల సాగు వైపు ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు నీటి లభ్యత, పంటల ఎంపిక, అంతర పంటల సాగు, ఎరువుల వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పిస్తూ, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా స్థానిక ఆయిల్ పామ్ రైతులను ఇతర ప్రాంతాల్లో రైతులు అవలంబిస్తున్న విధానాలపై క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజనేయులు, ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్, వ్యవసాయ శాఖ అధికారులు, సర్పంచులు. రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరం

**ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: దుర్గారెడ్డి**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19:** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వరంలా మారిందని కాంగ్రెస్ పార్టీ పుల్కల్ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి అన్నారు. బుధవారం పుల్కల్ మండలంలోని ఈసోజిపేట గ్రామంలో ఇటీవల నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామ అధ్యక్షులు మున్నూరు మాణిక్యం పటేల్‌తో కలిసి నూతన గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లోని నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి పేద కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ పుల్కల్ మండల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మున్నూరు మల్లేష్ పటేల్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హరీశ్‌రావు హౌస్ అరెస్టును ఖండించిన ఆదర్శ్‌రెడ్డి

**టిమ్స్ ఆసుపత్రిని సందర్శించేందుకు వెళ్తుంటే అడ్డుకోవడం సరికాదు**





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19:** సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిని సందర్శించేందుకు సిద్ధమైన మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావును హౌస్ అరెస్ట్ చేయడాన్ని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. టిమ్స్ ఆసుపత్రిని తానే నిర్మించా నని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నప్పుడు, ఆసుపత్రిని సందర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను ఎందుకు అడ్డుకుంటున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారని ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రిలోని వాస్తవాలు బయటకు వస్తాయనే భయంతోనే హౌస్ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావును కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లే తొందరలో సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిని హడావుడిగా ప్రారంభించారని, సరైన సౌకర్యాలు లేకుండానే ప్రారంభించారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బంగారు పతక విజేతకు సన్మానం



**మందమర్రి టౌన్ ఆగస్టు 19 క్రైమ్ మిర్రర్:** నాసిక్ లో జరిగిన పెన్ కాక్ సిలాట్ జాతీయ స్థాయి పోటీలో మంచిర్యాల జిల్లాకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 11 పథకాలు సాధించారు.ఈ పోటీలో మందమర్రి పట్టణానికి చెందిన కొప్పు మోక్షిత్ బంగారు పతకం సాధించి జాతీయ స్థాయిలో మొదటి విజేతగా నిలిచాడు.ఈ సందర్భంగా కాక పౌండే షన్ ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మందమర్రికి విచ్చేసిన రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి,పెద్దపల్లి ఎం.పి గడ్డం వంశీ కృష్ణ లు మోక్షిత్ కు బంగారు పథకాన్ని మెడలో వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.ఇదే స్ఫూర్తి తో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్....



**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 19 :** చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలు, దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భూ భారతి, సాదా బైనామా కింద కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. భూ భారతి కింద కార్యాలయానికి వచ్చిన మొత్తం దరఖాస్తులు, స్వీకరించినవి, పరిశీలనలో ఉన్నవి, ధ్రువీకరించినవి, పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను రికార్డుల ఆధారంగా కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా సాదా బైనామా కింద వచ్చిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్నవి, ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయనే వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను దరఖాస్తుల వారీగా పరిశీలించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తు ఎందుకు పెండింగ్‌లో ఉంది, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారు, ఇంకా ఏ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందనే వివరాలను తహసీల్దార్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. అవసరమైన విచారణ, రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత నివేదికల ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించిన భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను కూడా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా దరఖాస్తులను నిబంధనల ప్రకారం విచారణ నిర్వహించి పరిష్కరించారా, సంబంధిత రికార్డులు, ఆధారాలను పరిశీలించారా, అవసరమైన నివేదికలు తీసుకున్నారా అనే అంశాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోరాదని, ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం మాత్రమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సాదా బైనామా దరఖాస్తుల విషయంలో భూమికి సంబంధించిన రికార్డులు, హక్కులు, ఇతర సంబంధిత వివరాలను నిశితంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన పత్రాలు లేదా సమాచారం లోపించిన సందర్భంలో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేసి, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి విధులు, బాధ్యతలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి రోజువారీగా వచ్చే ప్రజల సంఖ్య, స్వీకరిస్తున్న దరఖాస్తులు, వాటి నమోదు, పరిశీలన, పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తదితర ధ్రువీకరణ పత్రాల కోసం వస్తున్న దరఖాస్తుల సంఖ్య, పరిష్కారానికి పడుతున్న సమయం, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత కాలపరిమితిలో జారీ చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తుల ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ భూములు, హక్కులు, ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తారని, వారి దరఖాస్తులను నిబంధనల మేరకు పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించడం అధికారుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . ఏ దరఖాస్తును కూడా అనవసరంగా పెండింగ్‌లో ఉంచరాదని, ప్రతి దరఖాస్తును దరఖాస్తుల వారీగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని తహసీల్దార్, సిబ్బందికి స్పష్టం చేశారు.




## శ్రీ ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఇనగంటి ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలు

**గురుస్వామి ప్రసాద్‌రావుకు ఘన సన్మానం.. పేదలకు అండగా నిలవాలని పిలుపు**

**బాలానగర్, ఆగస్టు 19 (క్రైమ్ మిర్రర్):** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త, ఎస్వీ కన్స్ట్రక్షన్స్ సంస్థ నిర్వాహకులు, అయ్యప్ప స్వామి భక్తుడు, గురుస్వామి ఇనగంటి ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలను బుధవారం ఫతేనగర్ పైప్‌లైన్ రోడ్డులోని శ్రీ సాయి జ్యోతి మెడికల్ దుకాణం వద్ద భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి భక్తులు, సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాద్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు గురుస్వామి ఎనగంటి ప్రసాద్‌రావును ఘనంగా సన్మానించి, ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమితి సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు కలిసి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ధర్మాన్ని పాటిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలి జన్మదిన వేడుకల సందర్భంగా ఇనగంటి ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ఫతేనగర్ శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో తన జన్మదిన వేడుకలను అందరూ కలిసి నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటిస్తూ, మానవత్వాన్ని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి తమకు చేతనైనంత సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలిచి, తమ వంతు సహాయాన్ని అందించాలని కోరారు. "మనకు ఉన్నదాంట్లో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి అందించడం ద్వారా నిజమైన మానవత్వాన్ని చాటుకోవాలి. అందరం కలిసికట్టుగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పేదలకు అండగా నిలవాలి" అని ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శ్రీ అయ్యప్ప సేవా సమితి సభ్యుల అభినందనలు ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. గురుస్వామి ఎనగంటి ప్రసాద్‌రావు అయ్యప్ప స్వామిపై భక్తిశ్రద్ధలతో పాటు సేవా కార్యక్రమాల పట్ల కూడా ఎంతో ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టే శక్తిని అయ్యప్ప స్వామి ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు కొట్టం శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వాసుగుప్తా, వడకట్టు శ్రీనివాస్(మెడికల్ ), చిట్టిబాబు,సూర్య కిరణ్, ఆర్ కే రాజు పటేల్, మధు, చిన్న, మధుగుప్తా, పురుషోత్తం, జంఫిర్,రత్నం, కోటి, నాగరాజు తదితరులు పాల్గొని గురుస్వామి ఇనగంటి ప్రసాద్‌రావుకు ఘనంగా జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

## గనుల మూసివేతపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమీక్ష

**పర్యావరణ పరిరక్షణ, ప్రత్యామ్నాయ ఉపాధిపై కీలక ఆదేశాలు**



**మంచిర్యాల ఆగస్టు 19 (క్రైమ్ మిర్రర్):** బొగ్గు గనుల మూసివేతతో ప్రభావితమయ్యే ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం దేశవ్యాప్తంగా కోల్ ఇండియా, నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్, సింగరేణి సహా ఇతర బొగ్గు సంస్థల పరిధిలోని ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.గనుల మూసివేత సమయంలో పర్యావరణానికి హాని కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. మూసివేత అనంతరం పరిసర ప్రాంతాలపై పడే ప్రతికూల ప్రభావాన్ని తగ్గించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు.గనుల మూసివేతతో ఉపాధి కోల్పోయే స్థానిక గ్రామాల ప్రజలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను చూపించాలని సూచించారు. వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేలా అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.సమీక్షలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో కొనసాగుతున్న గనుల మూసివేత కార్యకలాపాలను మంత్రికి వివరించారు. ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పన, సామాజిక అభివృద్ధికి ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్‌లో మైన్స్ ఏడీ జగన్మోహన్, సూపర్‌వైజర్ మధుసూదన్‌తో పాటు పలువురు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిఈఐఆర్ ద్వారా 25 పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ

**అత్తాపూర్ పోలీసుల చొరవతో బాధితులకు తిరిగి అందజేత**




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఈఐఆర్) పోర్టల్‌ను సమర్థంగా వినియోగిస్తూ అత్తాపూర్ పోలీసులు పోగొట్టుకున్న 25 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. సుమారు రూ.2 లక్షల విలువైన ఈ మొబైల్ ఫోన్లను బుధవారం బాధితులకు పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ల రికవరీ చేపట్టారు. రికవరీ చేసిన ఫోన్లకు సంబంధించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం బాధితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, వారి మొబైల్ ఫోన్లను నేరుగా అందజేశారు. పోయాయనుకున్న తమ విలువైన ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ అత్తాపూర్ పోలీసులకు, క్రైమ్ టీమ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా ప్రజలు ఆందోళన చెందకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసి, మొబైల్ ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయాలని తెలిపారు. దీంతో పోయిన ఫోన్‌ను ఇతరులు దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవడంతో పాటు, దాన్ని ట్రాక్ చేసి రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రజలు సిఈఐఆర్ (ceir.sancharsaathi.gov.in) పోర్టల్‌ను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్‌తో పాటు క్రైమ్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు. పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేయడంపై స్థానికులు పోలీసుల పనితీరును అభినందించారు.



## పిఆర్‌టియు రాజేంద్రనగర్ మండల శాఖ అధ్యక్షులుగా కడుమూరు సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా ఆస్కానీ శ్రీనివాస్‌సాగర్ నియామకం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ మండలం పిఆర్‌టియు మండల శాఖ నూతన అధ్యక్షులుగా కడుమూరు సుదర్శన్ , ప్రధాన కార్యదర్శిగా ఆస్కానీ శ్రీనివాస్‌సాగర్, గౌరవ అధ్యక్షులుగా మణిక్యంరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రంగారెడ్డి జిల్లా పిఆర్‌టియూ జిల్లా శాఖ అధ్యక్షులు సామల మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పిఆర్‌టియు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్యశ్రీనునాయక్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొనగారి కష్ణారెడ్డి, అధికార మాసపత్రిక సంపాదకులు జగన్మోహన్‌గుప్తా, గౌరవ అధ్యక్షులు పెద్దమారు రాఘవేందర్, ఎన్నికల పరిశీలకులుగా శివరామ్, హనుమంతు, రాజశేఖర్‌గౌడ్, సురేష్, సుధాకర్, వహీద్, మండల కార్యవర్గ సభ్యులు రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సత్యన్నా, అల్లవెల్లి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేష్‌ను పరామర్శించి సన్మానించిన కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై కోలుకొని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ప్రముఖ బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేష్‌ను బుధవారం కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లేష్ నివాసానికి వెళ్లిన వెంకటేష్ ఆయన ఆరోగ్య పరిస్థితిని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ క్యామ మల్లేష్ త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకొని, మళ్లీ ఎప్పటిలాగే ప్రజా జీవితంలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ శ్రీశైలం, మణికొండ మాజీ కౌన్సిలర్ ముత్యాలు, పార్టీ నాయకులు అడికే అర్జున్, గూడెం సత్యనారాయణ, ఆనంద్, అశోక్, రమేష్, రామస్వామి, రిషి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**బలమైన సాక్ష్యాలతో నేరం రుజువు**

**రూ.500 జరిమానా.. చెల్లించకుంటే 15 రోజుల జైలు**

**పోలీసుల దర్యాప్తును అభినందించిన ఎస్పీ**

**సాక్ష్యాలు, సీసీటీవీ ఆధారాలతో కేసు ఛేదింపు**

**తీర్పు వెలువరించిన జిల్లా ప్రధాన, సెషన్స్ న్యాయమూర్తి జి. భవాని చంద్ర**



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19: రెండున్నరేళ్ల చిన్నారి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రధాన, సెషన్స్ న్యాయమూర్తి జి. భవాని చంద్ర బుధవారం తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 15 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన క్రైమ్ నంబర్ 243/2023, ఐపీసీ సెక్షన్ 302 కింద నమోదైన హత్య కేసులో ముడావత్ సురేష్ (25) నిందితుడిగా ఉన్నాడు. కేసు దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీ, సాక్షుల వాంగ్మూలాలు, వైద్య, ఫోరెన్సిక్ ఆధారాలను పోలీసులు సేకరించారు.దర్యాప్తులో లభించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకుని అప్పటి సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. శ్రీధర్‌రెడ్డి నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. న్యాయస్థానంలో విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి జీవిత ఖైదు, జరిమానా విధించారు. బలమైన సాక్ష్యాధారాలతో కేసును సమర్థవంతంగా నడిపించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. శైలజ, అప్పటి దర్యాప్తు అధికారి ఎన్. శ్రీధర్‌రెడ్డి, ప్రస్తుత సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. రామునాయుడు, కోర్టు డ్యూటీ అధికారి హెడ్ కానిస్టేబుల్ రాజు, జిల్లా కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, జిల్లా లైజనింగ్ అధికారి కె. సత్యనారాయణ తదితరులను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అభినందించారు.

# అమీన్‌పూర్ 22ఏ బాధితులకు న్యాయం చేయాలి: హరీష్ రావు

**40 ఏళ్లుగా నివసిస్తున్నా.. 22ఏతో ఇబ్బందులు**

**నిజమైన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి**

**బ్రోకర్ల అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి**

**మధ్యతరగతి కుటుంబాలకు తీవ్ర నష్టం**

**తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో హరీశ్‌రావు సమావేశం**

**పాల్గొన్న బిఆరెస్ నేతలు వి. ఆదర్శ్‌రెడ్డి, పాండురంగారెడ్డి**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19: 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన నిజమైన భూములను వెంటనే తొలగించి బాధితులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో 22ఏ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులతో ఆయన సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత 40 ఏళ్లుగా నివాసం ఉంటూ, అప్పట్లో హెచ్‌ఎండీఏ, హుడా అనుమతులతో కొనుగోలు చేసిన భూములను ప్రస్తుతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని బాధితులు హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డితో కలిసి అమీన్‌పూర్ ప్రాంతానికి చెందిన బాధితులు సమావేశానికి హాజరై తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 22ఏ జాబితాలో ఉన్న కొన్ని భూములను ప్రభుత్వం తొలగిస్తున్నప్పటికీ, నిజమైన హక్కుదారులైన మధ్యతరగతి కుటుంబాలు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. హాట్‌కేక్ ప్రాంతాల్లోని కొన్ని భూములు 22ఏ నుంచి తొలగించబడుతున్నాయని, సామాన్యుల నిజమైన భూములను మాత్రం నిషేధిత జాబితాలో కొనసాగించడం సరికాదన్నారు. భూములను 22ఏ నుంచి తొలగించేందుకు కొందరు బ్రోకర్లు 30 శాతం వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, ఇలాంటి అక్రమాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సమస్యపై పూర్తి సమాచారం ఉన్నప్పటికీ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఏళ్ల తరబడి చట్టబద్ధంగా నివసిస్తూ, హెచ్‌ఎండీఏ, హుడా అనుమతులతో ఉన్న నిజమైన భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధిత మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం చేయాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, 22ఏ బాధితులు పాల్గొన్నారు.



## మోకిలలో 35 నివాస ప్లాట్ల ఈ-వేలానికి ప్రీ-బిడ్ సమావేశం

హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్): మోకిల లేఅవుట్‌లోని 35 నివాస ప్లాట్ల ఈ-వేలానికి సంబంధించి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం మోకిలలో ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ-వేలం ప్రక్రియ, నిబంధనలు, అర్హతలు, బిడ్డింగ్ విధానంపై ఆసక్తి గల బిడ్డర్లకు అధికారులు వివరించారు. సమావేశంలో హెచ్‌ఎమ్‌డిఏ సూపరింటెండింగ్ ఇంజనీర్ వీవీవీఎస్ అప్పారావు, డిప్యూటీ కలెక్టర్ వై. సుదర్శన్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఏ. రవీందర్ రెడ్డి, పి ఆర్ ఓ కె. శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ డి. శ్రీకాంత్ రెడ్డితో పాటు ఎంఎస్టి సి, కెపిఎంజి ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో ఆసక్తి గల బిడ్డర్లు హాజరయ్యారు. హెచ్‌ఎమ్‌డిఏ ఇంజనీరింగ్, ప్లానింగ్, ఎస్టేట్స్ విభాగాల అధికారులు ప్లాట్ల వివరాలు, లేఅవుట్ అభివృద్ధి, మౌలిక వసతులు, ఈ-వేలం నిబంధనలపై బిడ్డర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఎంఎస్టి సి ప్రతినిధులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, అర్హత, బిడ్ల సమర్పణ, ఈ-వేలంలో పాల్గొనే విధానాన్ని వివరించారు. మోకిల వ్యూహాత్మక ప్రాంతంలో ఉండటం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, మౌలిక వసతులు, హైదరాబాద్ పశ్చిమ ప్రాంత కారిడార్‌తో మెరుగైన అనుసంధానం వంటి అంశాలను హెచ్‌ఎమ్‌డిఏ అధికారులు వివరించారు. ముఖ్య తేదీలు: ఈ-వేలంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఆగస్టు 31, 2026 కాగా, ఈ-వేలం సెప్టెంబర్ 2, 2026న నిర్వహించనున్నారు. మరిన్ని వివరాల కోసం హెచ్‌ఎమ్‌డిఏ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 7416835522ను సంప్రదించవచ్చు. ప్రీ-బిడ్ సమావేశం ద్వారా బిడ్డర్లకు ఈ-వేలం ప్రక్రియపై స్పష్టత లభించడంతో పాటు, పారదర్శకంగా వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

## శంషాబాద్‌లో ఎస్ఐఆర్ రెండో దశ అసెంబ్లీ కార్యశాల

**రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన**



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో దశకు సంబంధించి అసెంబ్లీ కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజస్థాన్ రాజ్యసభ సభ్యురాలు అల్కా సింగ్ గురజార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసిన అల్కా సింగ్ గురజార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎంపీ మర్రి శశిధర్ రెడ్డిని కూడా స్వాగతించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులతో కలిసి శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి కార్యశాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ రెండో దశలో ఓటర్ జాబితా సవరణ, ఓటర్ల వివరాల పరిశీలన, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై కార్యక్రమంలో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నగర్‌లో రూ.30 లక్షలతో రోడ్డు పనులకు శ్రీకారం



గండిపేట(క్రైమ్ మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేష్ నగర్‌లో స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్ సహకారంతో రూ.30 లక్షల నిధులతో చేపట్టనున్న రోడ్డు పనులను మాజీ డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ ప్రారంభించారు. చాలాకాలంగా రోడ్డు సమస్యతో ఇబ్బందులు పడుతున్న గణేష్ నగర్ వాసులకు ఈ పనులు ఊరటనివ్వనున్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఏర్పడే ఇబ్బందులు కూడా తగ్గే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్ సహకారంతో గణేష్ నగర్‌లో రూ.30 లక్షలతో రోడ్డు పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు టీ. ప్రేమ్ గౌడ్, బాస శ్రీనివాస్ నేత, కళ్లెం లక్ష్మారెడ్డి, గట్టయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**



వనపర్తి ఆగస్టు 19క్రైమ్ మిర్రర్ : అర్హులైన పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డుకు చెందిన లబ్ధిదారు గుంటి సువర్ణ ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం లబ్ధిదారుకు ఇందిరమ్మ ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు.బిఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జములమ్మ, పెద్ద రాములు, వాడు ఆఫీసర్ విష్ణు, కాలనీ వాసులు పద్మ పాల్గొన్నారు.బి

## మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా రాజ్యలక్ష్మి



మునుగోడు క్రైమ్ మిర్రర్: భారతీయ జనతా పార్టీ మహిళ మోర్చా జిల్లా కార్యదర్శిగా మునుగోడు మండల కేంద్రానికి చెందిన నీరుడు రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు.జిల్లా అధ్యక్షులు రావిల్ల కాశమ్మ నియామక పత్రం అందజేశారు...పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.




## అయ్యప్ప సొసైటీలో "సురక్షా కా తిరంగా" సైబర్ అవగాహన కార్యక్రమం.....

**యువతకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించిన డీసీపీ రితి రాజ్ ఐపీఎస్......**



క్రైమ్ మిర్రర్ మాదాపూర్ ప్రతినిధి : తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా -- టువర్డ్స్ ఏ సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ" నెలరోజుల సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప సొసైటీలో సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది పిల్లలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.కూకట్‌పల్లి డీసీపీ శ్రీమతి రితిరాజ్, ఐపీఎస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్న వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించే సమయంలో అప్రమత్తత, జాగ్రత్తలు పాటించడం ఎంతో ముఖ్యమని ఆమె సూచించారు.ఓటీపీ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఫేక్ ఉద్యోగ ఆఫర్లు, వ్యక్తుల పేరుతో జరిగే మోసాలు, ఇతర ఆన్‌లైన్ స్కామ్‌ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీసీపీ హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయడం, ధృవీకరించని సందేశాలకు స్పందించడం చేయకూడదని తెలిపారు.యువత సైబర్ సేఫ్టీ అంబాసిడర్లుగా మారి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని డీసీపీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది పిల్లలు, యువత చురుకుగా పాల్గొని సైబర్ భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ మాదాపూర్ శ్రీధర్, మాదాపూర్ ఎస్‌హెచ్ఓ కె.వి. సుబ్బారావు, ఎస్ఐలు నరేష్, గిరీష్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం



గండిపేట(క్రైమ్ మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువత అదృశ్యమైప సంఘటన చోటు చేసుకుంది. ఎసై ?స విశ్వనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శాస్త్రీపురం ముస్తాఫానగర్ ప్రాంతానికి చెందిన సైదా సానియా ఫెర్దోజ్(20) స్థానికంగా లేబర్‌గా పని చేస్తుంది. ఈ నెల 17వ తేదీన దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె మానసిక స్థితి సరిగ్గా లేదని వెల్లడించారు. చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద ఆమె ఆచూకీ కోసం చూడగా సమాచారం అందలేదన్నారు. దీంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పల్లెచెరువుకు గండి అంటూ పుకార్లు..

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన**


**మైలార్‌దేవుపల్లిలో వాట్సాప్ ఫార్వర్డ్ మెసేజ్‌లతో కలకలం**



గండిపేట(క్రైమ్ మిర్రర్): మైలార్‌దేవుపల్లి పరిధిలోని పల్లెచెరువుకు గండి పడిందంటూ సోషల్ మీడియాలో, ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం కావడంతో స్థానికంగా కలకలం నెలకొంది. గండి కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరిందంటూ పలువురు ఫార్వర్డ్ మెసేజ్‌లు చేయడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. చెరువు పరిసరాలను పరిశీలించి వాస్తవ పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. పల్లెచెరువుకు గండి పడిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ధృవీకరణ లేని సమాచారాన్ని వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఇతరులకు ఫార్వర్డ్ చేయవద్దని పోలీసులు హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు లేదా అనుమానాస్పద సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తప్పుడు ప్రచారంతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించవద్దని పోలీసులు కోరారు. పల్లెచెరువు గండి విషయంపై వస్తున్న వాట్సాప్ మెసేజ్‌లను ప్రజలు నమ్మకుండా అధికారిక సమాచారం కోసం వేచి ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 గురువారం 20-8-2026

# అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి కనిపించకుండాపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన నబీలా మెహక్(23) ఈ నెల 13వ తేదీన ఇంట్లో అందరు నిద్రపోయిన తరువాత ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమె ఆచూకీ కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఎలాంటి సమాచారం అందలేదన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# కనకదుర్గ దేవి ఆలయంలో ఘనంగా 30వ వార్షికోత్సవ వేడుకలు

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. వైభవంగా అమ్మవారి శోభాయాత్ర**



**కూకట్ పల్లి, ఆగష్టు 19 (క్రైమ్ మిర్రర్):** బాలానగర్‌లోని ఫతేనగర్ జవహర్ కాలనీలో కొలువైన శ్రీ కనకదుర్గ దేవి, శీతలా దేవి, కాళికా దేవి ఆలయంలో 30వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో రోజంతా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. వార్షికోత్సవ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం దుర్గా హోమం, మూల మంత్ర హవనం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది. సాయంత్రం అమ్మవారి శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలు, నామస్మరణల మధ్య అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక పసుపు-బొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అర్చకులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు దోర్బల కాశీనాథ్ శర్మ పర్యవేక్షణలో వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, సభ్యులు, స్థానిక భక్తులు అందించిన సహాయ సహకారాలతో అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారు. 30వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడంతో జవహర్ కాలనీతో పాటు ఫతేనగర్ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ప్రార్థించారు.

# పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనపై ముగ్గురిని బీజేపీ పార్టీ బాధ్యతల నుంచి తొలగింపు




**సంస్థాన్ నారాయణపురం, క్రైమ్ మిర్రర్)::-** సంస్థాన్ నారాయణపురం భారతీయ జనతా పార్టీ సంస్థాన్ నారాయణపురం మండల శాఖలో పార్టీ నిబంధనలు, క్రమశిక్షణ మరియు పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు పార్టీ దృష్టికి వచ్చిన నేపథ్యంలో, పార్టీ ప్రయోజనాలు, సంస్థాగత క్రమశిక్షణ మరియు ఐక్యతను దృష్టిలో ఉంచుకొని మండల ప్రధాన కార్యదర్శి బండమీది కిరణ్ మండల ఉపాధ్యక్షులు ఎలిజాల శ్రీను శక్తి కేంద్ర ప్రముఖ్ గుండె మల్లేష్ యాదవ్ ముగ్గురు నాయకులను వారు నిర్వహిస్తున్న పార్టీ బాధ్యతల నుంచి తక్షణమే తొలగించినట్లు మండల అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ తెలిపారు. జిల్లా పార్టీ ఆదేశానుసారం వీరిని సంబంధిత పార్టీ బాధ్యతల నుంచి తక్షణమే తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఇకపై పై ముగ్గురు నాయకులు తమకు కేటాయించిన పార్టీ పదవులు, బాధ్యతల హోదాను ఉపయోగించి ఎటువంటి అధికారిక పార్టీ కార్యక్రమాలు, నిర్ణయాలు లేదా పార్టీ ప్రతినిధిత్వ కార్యక్రమాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. పార్టీలో క్రమశిక్షణ, పార్టీ నిర్ణయాలకు విధేయత, సంస్థాగత ఐక్యతకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించే ఎలాంటి చర్యలను కూడా ఉపేక్షించబోమని బీజేపీ సంస్థాన్ నారాయణపురం మండల అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ పేర్కొన్నారు.

# మారుతున్న సవాళ్లకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణ: డిజిపి సి. వి. ఆనంద్

**ట్రాఫిక్, రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం**

**గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ నుంచి 513 మంది ఇతర విభాగాలకు బదిలీ**

**డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి**

**రెండు నెలల అటాచ్‌మెంట్ అనంతరం సిబ్బందికి కొత్త బాధ్యతలు**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మారుతున్న నేర స్వభావం, ప్రజా భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీసు శాఖలో మానవ వనరులను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు తెలంగాణ పోలీస్ అకాడమీ లో బుధ వారం జరిగిన సమావేశంలో డిజిపి సి. వి. ఆనంద్ తెలిపారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం ప్రధాన సవాళ్లుగా ఉండగా.. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత, ఆహార కల్తీ వంటి అంశాలు పోలీసులకు కొత్త సవాళ్లుగా మారాయని చెప్పారు.

**513 మందికి కొత్త బాధ్యతలు..**

గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ తదితర ప్రత్యేక విభాగాల నుంచి 513 మంది సిబ్బందిని ఎనిమిది విభాగాలకు అవసరాలకు అనుగుణంగా కేటాయించారు. వీరిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు, 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. ఆహార కల్తీ, డ్రగ్ కంట్రోల్‌కు 80 మంది, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 79 మంది, సివిల్ సప్లయిస్‌కు 28 మంది, డిజిపి కార్యాలయం--టి-స్పార్క్‌కు 27 మంది, ఏసీబీ, సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు 25 మంది చొప్పున కేటాయించారు.

**రెండు నెలల అటాచ్‌మెంట్ తర్వాత..**

కొత్త బాధ్యతలు అప్పగించే ముందు సిబ్బందిని వివిధ విభాగాల్లో రెండు నెలల పాటు అటాచ్‌మెంట్‌పై పనిచేయించామని డిజిపి తెలిపారు. ప్రభుత్వ అనుమతితో ఆయా విభాగాల్లో పోస్టుల ఏర్పాటు ఆధారంగా తుది కేటాయింపులు చేశామన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, నేపథ్యాన్ని పరిశీలించడంతో పాటు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. కొత్త విభాగాల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ అకాడమీలో 11 రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.



**తీవ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు..**

తెలంగాణలో 1980, 1990 దశకాల్లో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా ఉండేదని డీజీపీ గుర్తుచేశారు. అప్పటి పరిస్థితుల్లో ప్రత్యేక పోలీసు బలగం అవసరమై 1987లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో కేఎస్ వ్యాస్ నేతృత్వంలో ప్రత్యేక విభాగం ఏర్పడిందని తెలిపారు. అదే క్రమంలో గ్రేహౌండ్స్ రూపుదిద్దుకుందని చెప్పారు. గ్రేహౌండ్స్, ఎస్ఐబీ తదితర విభాగాలు మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. 2017 తర్వాత తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని, అయితే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల కర్రెగుట్టల ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ మౌలిక వసతుల కొరత స్పష్టంగా కనిపించిందని, కొన్ని ప్రాంతాల్లో రహదారులు, పాఠశాలలు, వైద్య సదుపాయాలు ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. 2007లో హైదరాబాద్‌లో లుంబినీ పార్క్, చార్మినార్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో ప్రత్యేక కౌంటర్ టెర్రరిజం సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందని, దాని ఫలితంగా ఆక్టోపస్ వంటి ప్రత్యేక విభాగాలు అభివృద్ధి చెందాయని డిజిపి వివరించారు.

**విద్యార్థులపై డ్రగ్స్ పంజా...**

యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని డిజిపి సి వి ఆనంద్ అన్నారు. గతేడాది 835 మంది విద్యార్థుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. మరో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అధ్యయనంలో సుమారు 70 శాతం మంది విద్యార్థులు డ్రగ్స్‌కు గురైనట్లు తేలిందని చెప్పారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా అడ్డుకోవడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను ఇప్పుడే కాపాడుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



**సైబర్ నేరాల్లో రూ.1,750 కోట్ల నష్టం...**

సైబర్ నేరాలు మరో ప్రధాన సవాలుగా మారాయని డిజిపి తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, నకిలీ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని చెప్పారు. గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల కారణంగా సుమారు రూ.1,750 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**రోడ్డు భద్రతకు పెద్దపీట...**

తాజా పునర్వ్యవస్థీకరణలో రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు డీజీపీ తెలిపారు. గత ఏడాది తెలంగాణలో రోడ్డు ప్రమాదాల్లో సుమారు 8 వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, అమలును మరింత బలోపేతం చేసేందుకు 224 మంది సిబ్బందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు సేఫ్టీ విభాగానికి కేటాయించినట్లు తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటికి సంబంధించిన ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రోడ్డు భద్రత కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

**క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి...**

కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న సిబ్బంది నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని డీజీపీ సూచించారు. శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. కొత్త బాధ్యతలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకుని క్రమశిక్షణతో, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లో ఫీల్డ్ ఆపరేషన్లు, నిర్వహణ, శిక్షణ తదితర అవసరాలకు సరిపడా సిబ్బందిని కొనసాగించినట్లు డిజిపి తెలిపారు. మూడు నెలల అనంతరం సిబ్బంది అవసరాలు, పనితీరును మరోసారి సమీక్షిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆక్టోపస్, సీఐడీ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ తదితర ప్రత్యేక విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



# సిఐటియు పోరాట ఫలితంగా మాదిరిపురం గ్రామంలో రిక్వెస్ట్ బస్టాండ్ సౌకర్యం ఏర్పాట్లు సిఐటియు జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్

**సిఐటియు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా డిపో మేనేజర్ కి వినతి పత్రం అందించిన 24 గంటల్లో సమస్య పరిష్కారం**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సిఐటియు పోరాట ఫలితంగా మాధురి పురం గ్రామంలో రిక్వెస్ట్ బస్ స్టాప్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆ సంఘం జిల్లా నాయకులు షేక్. బషీరుద్దీన్ అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని మాదిరిపురం గ్రామ లో బస్సులు ఆపాలని జిల్లా డిపో మేనేజర్ కు, మంగళవారం ఖమ్మం జిల్లా సీఐటీయూ నాయకులు షేక్ బషీరుద్దీన్ ఆధ్వర్యంలో మేనేజర్ కు వినతి పత్రం అందించారు. అందించిన వెంటనే స్పందించిన డిపో మేనేజర్ గారు 24 గంటల్లో సమస్యను పరిష్కారం చేస్తూ ఖమ్మం డిపో తొర్రూరు డిపో మరియు హనుమకొండ డిపో బస్సులు రిక్వెస్ట్ స్టాప్ తో మాధురి పురంలో ఆగేవిధంగా చేశామని ఫోన్ కాల్ చేసి చెప్పడం జరిగింది. రేపటి నుంచి అన్ని బస్సులు మాధురి పురం గ్రామం వద్ద ఆగుతాయని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్ గారికి ఫోన్ చేసి ఇట్టి విషయాన్ని తెలియపరిచారు. ఈ సందర్భంగా షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ వినతి పత్రం అందించిన 24 గంటల్లో స్పందించి సమస్యను వెంటనే పరిష్కారం చేసిన ఖమ్మం డిపో మేనేజర్ కి మరియు సూపర్డెంట్ కి ధన్యవాదాలు తెలియజేశారు. సిఐటియు ప్రజలు కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల మీద పోరాటాలు చేస్తుందని ఆయన సందర్భంగా గుర్తు చేశారు. పోరాడితే పోయేదేమీ లేదని అందుకే ప్రజలు కార్మికులు పోరాటాలకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

**ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో బల్లం సరిక శాంతమ్మ**

మణెమ్మ కనకమ్మ సత్తెమ్మ మమతా వెంకటలక్ష్మి స్రవంతి విజయలక్ష్మి హరిత అరుణ పద్మా లక్ష్మి సౌజన్య, సరిత ప్రవళిక సునీత లలిత సుజాత కవిత మాధవి మౌనిక మహిళాలు గ్రామ మహిళా సంఘ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై అవగాహన..! భద్రతపై భరోసా..!!

**కేజీబీవీలో బాలికల ఆరోగ్యం, భద్రతపై అవగాహన కార్యక్రమం**

**పోషకాహారంతో రక్తహీనతకు చెక్ పొట్టోచు**

**సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం**

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన**

**3,000 శానిటరీ ప్యాడ్ల పంపిణీ చేసిన అధికారులు**

**బాలికల విద్య, భద్రతకు ప్రాధాన్యం**



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 19:** బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అందోల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యం, బాలికల భద్రత, సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి బాలికకు నాణ్యమైన విద్య అందించడం, వారి ప్రతిభను ప్రోత్సహించడం, స్వయం సాధికారత సాధించేలా చేయడం సమాజం మొత్తం బాధ్యత అన్నారు. విద్యార్థినులు చిన్న వయస్సు నుంచే స్పష్టమైన కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకుని, సమయపాలన, క్రమశిక్షణ, నిరంతర కృషితో వాటిని సాధించాలని సూచించారు. బాలికల భద్రతపై అవగాహన కల్పిస్తూ సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్ అంశాలను వివరించారు. అసౌకర్యం లేదా ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే నమ్మకమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. సైబర్ భద్రతపై మాట్లాడుతూ.. అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, ఫొటోలు తదితర వివరాలను పంచుకోవద్దని సూచించారు. బాలికల ఆరోగ్యానికి సమతుల్య పోషకాహారం ఎంతో ముఖ్యమని అధికారులు తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, ధాన్యాలు, పాలు వంటి పోషకాహారం తీసుకోవడంతో పాటు రక్తహీనత నివారణకు ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం శానిటరీ ప్యాడ్ బ్యాంకు కింద విద్యార్థినులకు 3,000 శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. వాటి సరైన వినియోగం, భద్రపరిచే విధానం, వినియోగం అనంతరం సురక్షితంగా పారవేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, సీడీపీఓ మాధులిక, ఎంఆర్‌వో మధుకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎంఈఓ కృష్ణ, ఎస్ఓ జ్యోతి, ఇన్‌చార్జి ఎస్ఓ సుకన్య, మెడికల్ ఆఫీసర్ శంకర్, జిల్లా సమన్వయకర్త పల్లవి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎస్ఐ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జెండర్ స్పెషలిస్ట్, విద్యార్థినులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.